

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 18-07-2025 | సంపుటి - 24 | సంచిక - 75 రూ : 4 | పేజీలు: 8


810 జిల్లాల మీదుగా

## ఔటర్ రింగ్ రైలు!

- స్టేషన్ల సంఖ్య కనిష్ఠంగా 26.. గరిష్ఠంగా 34
- ఆరు మార్గాలతో అనుసంధానం.. మూడు ఎలైన్‌మెంట్లతో ప్రతిపాదనలు
- పూర్తయిన తుది సర్వే

**జులై 17, భువనేశ్వర్:** హైదరాబాద్: తెలంగాణలో రవాణా ఆధారిత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న ఔటర్ రింగ్ రైలు తుది సర్వే (ఫైనల్ లొకేషన్ సర్వే) ప్రక్రియ పూర్తయింది. సికింద్రాబాద్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు రాకపోకలు సాగించే

తరువాయి 2లో






రాయలసీమను

## రతనాల సీమగా మారుస్తాం

- వంద రోజుల్లో కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేశాం
- అసాధ్యమనుకున్న పనులను పూర్తిచేసి చరిత్ర సృష్టించాం
- ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 700 సేవలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- హంద్రీ నీవాకు నీరు వదిలి జలహారతి

**జులై 17:** కర్నూలు, నందికొట్కూరు, నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని.. సీమలోని

తరువాయి 2లో

గల్ఫ్ నేతలతో

## ట్రంప్ భేటీ..

- పశ్చిమాసియాలో శాంతిపై చర్చ



వాషింగ్టన్: పర్షియన్ గల్ఫ్‌లోని రెండు దేశాల నేతలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం శ్వేతసౌధంలో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్, సిరియా మధ్య తాజా ఘర్షణతో పశ్చిమాసియాలో శాంతి విషయంలో తాను ఇచ్చిన హామీపై తలెత్తిన సందేహాల గురించి చర్చించారు. బహ్రెయిన్ యువరాజు సల్మాన్ బిన్ హమద్ అల్ ఖలీఫాతో ఓవల్

తరువాయి 2లో



నీటి వాటాల్లో.. బీసీ రిజర్వేషన్ల అమలులో

## ద్రోహం చేసింది కేసీఆరే

- కృష్ణా జలాల్లో ఏపీ 1,200 టీఎంసీలు వాడుకున్నా పట్టనట్లుగా వ్యవహరించారు
- బనకచర్లపై చర్చ గురించి కేంద్రమే స్పష్టత ఇచ్చింది
- సెప్టెంబరు 30 లోపు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలూ పూర్తిచేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**జులై 17, దిల్లీ:** కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా రాబట్టే విషయంలో, బీసీలకు రిజర్వేషన్లు అమలుచేసే విషయంలో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ 720 టీఎంసీలకు బదులు 1,200 టీఎంసీలు వాడుకున్నా కేసీఆర్ పదేళ్లపాటు పట్టనట్లుగా వ్యవహరించారని దుమ్మెత్తిపోశారు. రాష్ట్ర ద్రోహి

తరువాయి 2లో

## ఔటర్ రింగ్ రైలుకు అనుమతివ్వండి

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

**జులై 17, దిల్లీ:** తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి దిల్లీలోని రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రీజనల్ రింగు రోడ్డుకు సమాంతరంగా ప్రతిపాదించిన ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు ఫైనల్ లొకేషన్ సర్వేకు రైల్వే బోర్డు ఇప్పటికే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తుచేశారు. రూ.8 వేల కోట్ల ఈ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడరేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరారు. తెలంగాణలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు.

తరువాయి 2లో





## రాష్ట్రానికి... జియోస్పేషియల్ పురస్కారాలు

- ఉద్యాన వర్సిటీ, జేఎన్‌టీయూ, బిర్లా ప్లానెటోరియంల ఎంపిక

**జులై 17, హైదరాబాద్:** కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్ జేఎన్‌టీయూ, హైదరాబాద్ బిర్లా ప్లానెటోరియంలు కేంద్ర విద్యాశాఖకు చెందిన సమాచార సాంకేతికత విద్యా జాతీయ మిషన్(ఎన్‌ఎంఈఐసీటీ), ఐఐటీ బాంబే నుంచి ఉత్తమ వర్సిటీ, ఉత్తమ సంస్థ పురస్కారాల్ని పొందాయి. భౌగోళిక ప్రయోగ సాంకేతికత(జియోస్పేషియల్ టెక్నాలజీ) విస్తృత వినియోగానికి బోధన, శిక్షణ ద్వారా సేవలందిస్తున్న కారణంగా.. నేషనల్ జియోస్పేషియల్ పురస్కారం2025 కింద వీటిని ఎంపిక చేశారు. భౌగోళిక సమాచార వ్యవస్థ(జీఐఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఐటీ బాంబే ఆడిటోరియంలో



గురువారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్ ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఉద్యాన వర్సిటీ తరఫున ఉపకులపతి దండా రాజిరెడ్డి, జేఎన్‌టీయూ తరఫున రెక్టార్ డాక్టర్

తరువాయి 2లో

## రుజువుంటే చూపించండి.. లేదంటే క్షమాపణ చెప్పండి



- కేటీఆర్‌పై సీఎం రేవంత్ ఆరోపణలను ఖండిస్తున్నా: హరీశ్‌రావు

హైదరాబాద్: ''కేటీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. రాష్ట్రాన్ని ప్రపంచం ముందు ఉంచిన నాయకుడు కేటీఆర్. ఆయన సవాల్ విసిరితే చర్చకు రాకుండా.. సీఎం దిల్లీకి వెళ్లారు. ఎవరో దుబాయ్‌లో చనిపోతే.. మా కేటీఆర్‌కు ఏం సంబంధం? ఆ రిపోర్ట్ మీ దగ్గర ఉంటే..

తరువాయి 2లో

# 810 జిల్లాల మీదుగా ఔటర్ రింగ్ రైలు!

(మొదటిపేజీ తరువాయి)

ఆరు రైలు మార్గాలతో ఇది అనుసంధానం కానుంది. ఔటర్ రింగ్ రైలు మార్గానికి మూడు రకాల ఎలైన్‌మెంట్లతో ద.మ.రైల్వే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వివిధ కోణాల్లో పరిశీలించి ఇందులో ఒక ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు.

**చుట్టుపక్కల జిల్లాలకు రైల్వే నెట్‌వర్క్**

ఈ ప్రాజెక్టుతో జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సులభమవుతాయి. ఆయా జిల్లాల్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రైలు కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న ఎనిమిది నుంచి 10 జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. కొత్తగా రైల్వేస్టేషన్లనూ నిర్మిస్తారు.

*** గూడ్స్ రైళ్లను మళ్లించడానికి ఆస్కారం..**

ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు.. రాష్ట్రంలో ప్రధానమైన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ముంబయి, వరంగల్, గుంటూరు ఇలా.. ఆరు రైలు కారిడార్లతో అనుసంధానం అవుతుంది. ప్రధానంగా గూడ్స్ రైళ్లను ఎక్కువగా మళ్లించడానికి వీలవుతుంది. ఈ రైళ్లు అనేక రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుంటాయి. వాటిని సికింద్రాబాద్ వరకు రాకుండా మధ్యలోనే రింగ్ రైలు మార్గం ద్వారా ఇతర రూట్లలోకి మళ్లించడానికి ఆస్కారం ఉంటుంది. తద్వారా సికింద్రాబాద్, హైదరాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గించవచ్చు. అంతర్రాష్ట్ర, దూరప్రాంత వాహనాలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లిపోతున్న మాదిరే రింగ్ రైలు మార్గంతోనూ అలాంటి ప్రయోజనం ఉంటుంది.

**దేశంలోనే మొట్టమొదటిసారి..**

ఒక నగరం చుట్టూ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు చేపట్టనుండటం దేశంలోనే ఇదే మొదటిసారి అవుతుంది. బెంగళూరు, చెన్నై, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో ముఖ్యమైన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు శివార్లలో రైల్వే టెర్మినళ్లు నిర్మించారు. కానీ, రింగ్ రైలు ఎక్కడా లేదు. 2023లో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రకటించింది. 2023 సెప్టెంబరులో ఫైనల్ లొకేషన్ సర్వే చేసేందుకు అనుమతి ఇవ్వగా.. అది ఇటీవల పూర్తయింది. ఔటర్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్లలో ఆప్షన్ 1, 3లు ఎనిమిది జిల్లాల పరిధిలోకి వస్తున్నాయి. ఇందులో మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలు ఉన్నాయి. ఆప్షన్ 2లో పై ఎనిమిది జిల్లాలతోపాటు జనగామ, కామారెడ్డి ఉన్నాయి.

# నీటి వాటాల్లో.. బీసీ రిజర్వేషన్ల అమలులో ద్రోహం చేసింది కేసీఆరే

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆరే అని అన్నారు. కృష్ణా, గోదావరి జల వివాదంపై కేంద్రజలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన గురువారం ఇక్కడ తన నివాసంలో దాదాపు 1.45 గంటలపాటు విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'బుధవారం నాటి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన ఎజెండా, మేం మా అజెండా పెట్టాం. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ పరిష్కరించలేని మూడు సమస్యలపై అక్కడికక్కడే నిర్ణయానికి వచ్చాం. నిర్ణయానికి రాలేని అంశాలపై సాంకేతిక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. సమావేశంలో బనకచర్ల గురించి చర్చ వచ్చిందా? లేదా? అన్న విషయంపై కేంద్ర ప్రభుత్వ ప్రకటన స్పష్టత ఇచ్చింది' అని తెలిపారు. జల వివాదాలపై బద్ధ శత్రువులైన భారత్‌పాకిస్థాన్‌లు మాట్లాడుకోగా లేంది తాను ఆంధ్రప్రదేశ్‌తో మాట్లాడితే తప్పేంటి అని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రకు కూడా వెళ్తానన్నారు. తాను ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికే ప్రాధాన్యమిస్తానని, కొట్లాట తన అంతిమ అస్త్రమని ప్రకటించారు. 'భారత రాష్ట్ర సమితి సాధించలేని చాలా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపెట్టింది. నేను సమన్వయంతో వెళ్లడంవల్లే కేసీఆర్‌కు పదేళ్లలో సాధ్యంకాని ఎన్నో పనులను కేంద్రం నుంచి సాధించుకోగలిగాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు మేం అమలు చేసి చూపుతాం' అని ధీమా వ్యక్తంచేశారు.

**శ్ర రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుకు...ప్రస్తుత ఆర్డినెన్స్‌కు సంబంధంలేదు**

"2018కి ముందు రాష్ట్రంలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఉంటే వాటిని 23%కి తగ్గిస్తూ చట్టం చేసింది కేసీఆరే. రిజర్వేషన్లు తగ్గించమని కోర్టు ఉత్తర్వులు లేకపోయినా కేసీఆర్ ఆ పనిచేసి బీసీలకు తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు గవర్నర్ ముందున్న ఆర్డినెన్స్... గతంలో బీసీ రిజర్వేషన్లను 23%కి తగ్గిస్తూ కేసీఆర్ చేసిన చట్టాన్ని రద్దుచేస్తూ జారీచేసింది. పాత చట్టాన్ని రద్దుచేస్తే 42% రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం అవుతుంది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుకు, ప్రస్తుత ఆర్డినెన్స్‌కు సంబంధంలేదు. రాష్ట్రపతి ముందు ఉన్నది విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42%కి పెంచుతూ చేసిన బిల్లు. రెండూ వేర్వేరు. ఇచ్చంపల్లి ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులు సాంకేతికంగా సాధ్యాసాధ్యాల గురించి చెప్పిన తర్వాత మేం రాజకీయ నిర్ణయం తీసుకుంటాం. నాగార్జునసాగర్ మీదుగా ఇచ్చంపల్లికావేరి అనుసంధానం మొదలుపెట్టాలని మేం ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. అయితే 20 ఏళ్ల క్రితం డీపీఆర్ తయారైంది కాబట్టి అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారి ఉంటాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సర్వే చేయించాలని చెబుతున్నాం. గోదావరికావేరి అనుసంధానంలో 80% నీరు ఏపీ, తెలంగాణలకు, 20% తమిళనాడుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతే తప్ప మా బేసిన్ నుంచి నీటిని అంతా బయటికి తరలిస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి నేనేమీ కేసీఆర్‌ను కాదు.

**వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా?**

చర్చలకు పోకుండా చేతులెత్తేస్తే మనం సరెండర్ అయినట్లే. చర్చలే తప్పయితే 2016, 2020ల్లో కేసీఆర్ ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లి చంద్రబాబు, జగన్‌లతో ఎలా మాట్లాడారు? వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా? ఏపీ ముఖ్యమంత్రితో నేను చర్చించడాన్ని తప్పుపడుతున్న కేటీఆర్.. మూడుసార్లు రహస్యంగా లోకేశ్‌తో ఎందుకు సమావేశమయ్యారో చెప్పాలి.

**విషాన్ని కుమ్మరించడానికి కుయుక్తులు**

ఎవరెన్ని విమర్శలు చేసినా నేను దిల్లీకి రావడం, కేంద్ర మంత్రులను కలవడం మానను. కృష్ణాలో 299 టీఎంసీలు చాలని ఒకసారి, 400 టీఎంసీలు చాలని మరోసారి లేఖ రాసిన హరీశ్‌రావు ఇప్పుడు మేం అంతకంటే ఎక్కువగా 500 టీఎంసీలు అడగడాన్ని తప్పుపడుతున్నారు. ఎవరైనా ఇలా మాట్లాడతారా? రోజా ఇంట్లో చేపల పులుసు తిని బేసిన్లు గీసిన్లు లేవు, రాయలసీమను రతనాలసీమ చేస్తా అని మాట్లాడింది కేసీఆరే. చంద్రబాబుతో ఎపెక్స్ కౌన్సిల్‌లో కూర్చొని.. గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయి, వాటిని వాడుకోవాలని చెప్పింది కూడా ఆయనే. ఆయన చేసిన తప్పులను ఇప్పుడు మేం సరిదిద్దుతుంటే చూసి కడుపులోని విషాన్ని కుమ్మరించడానికి కుయుక్తులు పన్నుతున్నారు.

**శ్ర సినిమాల్లో విలన్ ఎప్పుడైనా మొదట్లోనే చచ్చిపోతాడా?**

మేం ప్రతి కేసు విచారణలోనూ నిబంధన ప్రకారం వెళ్తున్నాం. కాళేశ్వరం అవినీతిపై కమిషన్ అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతోంది. కేసీఆర్‌ను కూడా పిలిపించి విచారించింది. కొందరు కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నిస్తున్నారు. సినిమాల్లో విలన్ ఎప్పుడైనా మొదట్లోనే చచ్చిపోతాడా? అది క్లైమాక్స్‌లో జరుగుతుంది. ఇక్కడా అంతే. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులు పోటీ చేస్తే మిగతాపార్టీలు అభ్యర్థులను నిలబెట్టకూడదని ఇదివరకున్న సంప్రదాయాన్ని ఉల్లంఘించింది కేసీఆరే. పీజేఆర్ చనిపోయినప్పుడు అప్పటి ప్రధాన ప్రతిపక్షం తెదేపా.. అభ్యర్థిని నిలబెట్టకూడదని నిర్ణయించినా, కేసీఆర్ మాత్రం తనపార్టీ తరఫున పోటీ పెట్టారు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చర్చలకు పోకుండా చేతులెత్తేస్తే మనం సరెండర్ అయినట్లే. చర్చలే తప్పయితే 2016, 2020ల్లో కేసీఆర్ ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లి చంద్రబాబు, జగన్‌లతో ఎలా మాట్లాడారు? వాళ్లు చేసిందే ఇప్పుడు మేం చేస్తే తప్పా? ఏపీ ముఖ్యమంత్రితో నేను చర్చించడాన్ని తప్పుబడుతున్న కేటీఆర్ మూడుసార్లు రహస్యంగా లోకేశ్‌తో ఎందుకు సమావేశమయ్యారో చెప్పాలి. ఇదివరకు డ్రగ్స్ ఆరోపణలు వచ్చినప్పుడు రక్తం, జుట్టు నమూనాలు ఇస్తానంటూ బీరాలు పలికి, తర్వాత దానిపై చర్చజరగకుండా చూడాలనే ఉద్దేశంతో కోర్టుకెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకున్న కేటీఆర్ ప్రగల్బాలు చూస్తుంటే నవ్వొస్తోంది. కేటీఆర్, ఆయన బావమరిది ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్నది గంజాయి, డ్రగ్స్ బ్యాచే. కేటీఆర్ స్నేహితుడు కేదార్‌నాథ్ దుబాయ్‌లో అన్ని రకాల డ్రగ్స్ కలగలిపి తీసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఆయన మరణానికి దారితీసిన నివేదికలను అక్కడి నుంచి తెప్పించాం. అవసరమైనప్పుడు వాటిని అసెంబ్లీలోనూ పెడతాం.

# రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఎకరాకూ నీళ్లివ్వడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాలలోని హెచ్‌ఎన్ఎస్ఎస్ (హంద్రీ నీవా సుజల స్రవంతి) పంపింగ్ స్టేషన్ నుంచి ఆయన గురువారం నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం అల్లూరులో బహిరంగ సభలో మాట్లాడారు. 'రాయలసీమ చరిత్రలో నేడు ఒక శుభదినం. సీమను మార్చేది నీళ్లే. నేను ఇక్కడే పుట్టి పెరిగా. కరవు, కష్టాలు నాకు తెలుసు. అందుకే హంద్రీ నీవా పనులను వంద రోజుల్లోనే పూర్తి చేసి చూపించాం. కాలువలో ఇకపై 3,850 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. నంద్యాల జిల్లా మల్యాల నుంచి చిత్తూరు వరకు నీళ్లందుతాయి. మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తాం. వంద రోజుల్లో కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం సాధ్యం కాదన్నారు. చేసి తీరాలని చెప్పి పూర్తి చేయించి రికార్డు సృష్టించాం. ఫలితంగా 40 టీఎంసీలను రాయలసీమకు పంపేందుకు అవకాశం కలిగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల చిత్తశుద్ధికి అభినందనలు' అని ప్రశంసించారు.

**కుప్పంలో పెద్ద డ్రామా నడిపించారు**

హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి పది వేల క్యూసెక్కుల నీరు పారిస్తామని ప్రగల్భాలు పలికిన గత ప్రభుత్వం పది పైసలు కూడా ఖర్చు పెట్టలేదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. 'అదొక ఫేక్ పార్టీ. కుప్పం కాలువలో నీళ్లు లేకపోయినా సినిమా సెట్టింగ్ వేశారు. ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోశారు. ప్రారంభోత్సవం పూర్తయి వాళ్లు వెళ్లగానే నీళ్లన్నీ ఇంకిపోయాయి. అలాంటి డ్రామాలు కావాలా?' అని ప్రశ్నించారు.

**రాయలసీమ డిక్లరేషన్ అమలుచేస్తాం**

రాయలసీమ అభివృద్ధికి నారా లోకేశ్ ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించారని.. వాటన్నింటినీ అమలు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ రానన్ని సీట్లు తెదేపాకు వచ్చాయని.. ప్రజలు చూపించిన ఆదరణను నిలబెట్టుకుంటామన్నారు. కేంద్రం రైతు భరోసా నిధులు విడుదల చేసిన వెంటనే అదేరోజు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల కారణంగా 8.50 లక్షలమందికి ఉద్యోగాలొస్తాయని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్‌లో ప్రస్తుతం 550 సేవలు అందిస్తున్నామని, ఆగస్టు 15 నుంచి 700 సేవలు అందుతాయని తెలిపారు.

**ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ పనులు చేశారు**

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ హంద్రీ నీవా పనులను ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ పనులు చేశారన్నారు. నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ తాము వంద రోజుల్లో హెచ్ఎన్ఎస్ఎస్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తే జగన్ ఐదేళ్లలో ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. 'చంద్రబాబు ఎగిరిపోతాడు' అంటూ నీచపు మాటలు మాట్లాడుతున్నారని.. కానీ ఆయన గల్లీ నుంచి దిల్లీ వరకు ఎదిగిపోతున్నారని గుర్తుచేశారు. ఎవరు ఎగిరిపోతారో చరిత్ర చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రైలుకు అనుమతివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల అనుసంధానం, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులు, దిగుమతుల కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వికారాబాద్‌కృష్ణా (122 కి.మీ.; అంచనా వ్యయం రూ.2,677 కోట్లు), కల్వకుర్తిమాచర్ల (100 కి.మీ.; రూ.2 వేల కోట్లు), డోర్నకల్‌గద్వాల (296 కి.మీ.; రూ.6,512 కోట్లు), డోర్నకల్‌మిర్యాలగూడ (97 కి.మీ.; రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వేశాఖ ఖర్చుతో మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

*** ముచ్చర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు వినతి**

తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల బాధ్యతలూ నిర్వహిస్తున్న అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నందువల్ల ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ప్రాజెక్ట్, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే, ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు. ముచ్చర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద అనుమతి ఇవ్వాలని విన్నవించారు. రీజనల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో ఎంపీలు బలరాంనాయక్, చామల, రఘువీర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, ఉన్నతాధికారులు సంజయ్‌కుమార్, వికాస్‌రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# రుజువుంటే చూపించండి.. లేదంటే క్షమాపణ చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

బయటపెట్టండి. ఆయనపై చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించండి. లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పండి. ఏదో ఒక అక్రమ కేసు మాపై పెడతామంటే.. భయపడేది లేదు" అని భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "తన అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్.. డ్రగ్స్, గంజాయి అంటూ మా నాయకులపై బురద చల్లుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గ్రామాల్లో పాలన పడకేసింది. మలేరియా, డెంగీ వంటి రోగాలతో గురుకులాల విద్యార్థులు ఆసుపత్రుల్లో ఉంటున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయి. మా నాయకుల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. మా ఫోన్లను, మాతో మాట్లాడుతున్న విలేకరుల ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నారు. రోజూ ప్రజలను కలుస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి.. కనీసం సచివాలయానికి కూడా వెళ్లడం లేదు. సీఎంకు నిజాయతీ ఉంటే.. అసెంబ్లీలో చర్చకు రావాలి. మా మైక్ కట్ చేయొద్దు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# గల్ఫ్ నేతలతో ట్రంప్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో సమావేశమయ్యారు. ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ అల్ థానీతో బుధవారం సాయంత్రం ప్రైవేటు విందులో పాల్గొన్నారు. తన కుటుంబ సభ్యులకు గల్ఫ్‌లో వ్యాపారాలు ఉన్న నేపథ్యంలో ట్రంప్.. ఆ దేశాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీంతోపాటు అమెరికా సైనిక స్థావరాలూ ఉన్నాయి. రెండో విడత అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో ఆయన పర్యటించారు. 'వారికి ఏ అవసరమొచ్చినా సాయం చేస్తాం. అలాగే మాకే అవసరం వచ్చినా వారు సాయం చేస్తారు' అని ట్రంప్ సమావేశాల అనంతరం వ్యాఖ్యానించారు.

అల్ ఖలీఫాతో జరిగిన సమావేశంలో కుదిరిన ఒప్పందం ప్రకారం.. అమెరికా యుద్ధ విమానాలు, జెట్ ఇంజిన్లు, కంప్యూటర్ సర్వర్లను బహ్రెయిన్ కొనుగోలు చేయనుంది. అల్యూమినియం ఉత్పత్తి, కృత్రిమ మేధలో మరిన్ని పెట్టుబడులు పెట్టనుంది.

# ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా యూలియా పేరు ఖరారు

కీవ్: ఉక్రెయిన్ ప్రధానమంత్రిగా డెనిస్ ష్మిహాల్ స్థానంలో యూలియా స్విరిడెంకో పేరు ఖరారైంది. దేశ ఉప ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా ఉన్న ఆమెను పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధానిగా నియమించనున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ నాలుగురోజుల క్రితమే ప్రకటించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించాక ప్రభుత్వాధినేతను మార్చడం ఇదే తొలిసారి. గతంలో అమెరికాతో ఖనిజ ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఆమె మధ్యవర్తిగా వ్యవహరించారు. అగ్రరాజ్యంతోపాటు పాశ్చాత్య దేశాలతో దౌత్యంలో ఆమెకు అనుభవం ఉంది. ఇప్పుడు అమెరికా నుంచి మరిన్ని ఆయుధాలు పొందేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తున్నవేళ డెనిస్ నియామకం ఖరారైంది. సుదీర్ఘ యుద్ధం కారణంగా నిరుత్సాహంగా ఉన్న ప్రభుత్వ



యంత్రాంగంలో కొత్తశక్తిని నింపేందుకు జెలెన్‌స్కీ తన మంత్రివర్గంలో మార్పులు చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొత్త మంత్రివర్గం దేశీయ ఆయుధ ఉత్పత్తిని మరింత వేగవంతం చేసే దిశగా పనిచేయనుంది. దేశానికి అవసరమైన ఆయుధాల్లో సగభాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసుకునే స్థాయికి మరో ఆరు నెలల్లో చేరుతామని జెలెన్‌స్కీ అంటున్నారు.

**స్విట్జర్లాండ్‌కు వెళ్లాల్సినవి ఉక్రెయిన్‌కు..**

తాము అమెరికా నుంచి కొనుగోలు చేయదలచుకున్న పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థల్ని ఉక్రెయిన్‌కు మళ్లించాలని అగ్రరాజ్యం నిర్ణయం తీసుకున్నట్లు స్విట్జర్లాండ్ తెలిపింది. నిజానికి 2027, 2028లలో ఇవి తమకు రావాల్సి ఉన్నాయని వెల్లడించింది. తాజా దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన 122 డ్రోన్లను రష్యా కూల్చివేసింది. 64 డ్రోన్లను ఉక్రెయిన్‌పైకి రష్యా పంపింది. సైనికులు సహా వెయ్యిమంది మృతదేహాలను ఉక్రెయిన్‌కు రష్యా పంపింది. ఉక్రెయిన్ కూడా రష్యాకు 19 మృతదేహాలు పంపించింది.

# రాష్ట్రానికి జియోస్పేషియల్ పురస్కారాలు

(మొదటిపేజీ తరువాయి)

కె.విజయ్‌కుమార్‌రెడ్డి, బిర్లా ప్లానెటోరియం తరపున డైరెక్టర్ మృత్యుంజయరెడ్డి స్వీకరించారు. అలాగే జేఎన్‌టీయూకి చెందిన సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తాటిపర్తి విజయలక్ష్మి ఫ్యాకల్టీ ఫెలో అందుకున్నారు.

# చేతులెత్తి రోజంతా నిలబడండి.. దిల్లీ కోర్టులో వినూత్న శిక్ష

దిల్లీ: కోర్టు ధిక్కారానికి పాల్పడిన నలుగురు నిందితులకు దిల్లీ న్యాయస్థానం వినూత్న శిక్ష విధించింది. చేతులు పైకెత్తి కోర్టు హాలులో రోజంతా నిలబడాలని ఆదేశించింది. 2018కి సంబంధించిన ఓ కేసు తుది విచారణలో జ్యుడీషియల్ మేజిస్ట్రేటు సౌరభ్ గోయల్ ఈ శిక్ష విధించారు. "ఉదయం 10 నుంచి 11.40 గంటల మధ్య వేచి ఉండి, రెండుసార్లు పిలిచినా నిందితులు బెయిలు బాండ్లు సమర్పించలేదు. కోర్టు సమయం వృథా చేయడమంటే మా ఉత్తర్వులను ధిక్కరించడమే. ఐపీసీలోని 228వ సెక్షను కింద నిందితులు కోర్టు సమయం ముగిసేదాకా చేతులను నిటారుగా పైకెత్తి నిలబడాలి" అని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ కేసు నిందితుల్లో ఇద్దరు ఇప్పటికే మృతిచెందగా.. కుల్దీప్, రాకేశ్, ఉపాసన, ఆనంద్ మిగిలారు. మధ్యాహ్నం 12.48 గంటల ప్రాంతంలో కుల్దీప్ బెయిలు బాండ్లతోపాటు దరఖాస్తును సమర్పించడంతో.. కోర్టు కస్టడీ నుంచి అతడి విడుదలకు జడ్జి అనుమతించారు.

# పెట్రోలియం ట్యాంకర్ల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

*** సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**

ప్రజాస్పూర్తి , కాప్రా : చర్లపల్లి బీపీసీఎల్ యూనిట్ లో డ్రైవర్లు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక రవాణా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హిట్ అండ్ రన్ కేసుల్లో న్యాయం జరగాలని, కనీస వేతనం రూ.26,000, నైపుణ్య కార్మికులకు రూ.36,000 చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్ పాలసీ, ప్రమాద భీమా, విద్యా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డ్రైవర్లపై భారీ జరిమానాలు, శిక్షలు అన్యాయమని, మోటారు వాహనాల చట్టాన్ని న్యాయంగా అమలు చేయాలని అన్నారు. జూలై 9 కార్మిక సమ్మె విజయవంతమైందని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**సంఘం ఏర్పాటు అభినందనీయం : మేడ్చల్ జిల్లా అధ్యక్షుడుఎర్ర అశోక్**

బీపీసీఎల్ డ్రైవర్లు, హెల్పర్లు సీఐటీయూ యూనియన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధ్యం అవుతాయని అన్నారు. ఐక్యతే మార్గం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ ఒక్కడొక్కడిగా కాకుండా ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అవసరమైతే ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.జీఓ 282 రద్దు చేయాలని కార్యనిర్వాహక అధ్యక్షుడు జి. శ్రీనివాసులు 12 గంటల పనివిధానం అన్యాయమన్నారు. 8 గంటల పని విధానాన్ని పాటించాలని, జీవో 282ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సభకు తెలంగాణ పెట్రోల్ లియం చర్లపల్లి యూనిట్ అధ్యక్షుడు పి.గణేష్ అధ్యక్షతన వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్. బాధ్యుడు బంగారు నర్సింగరావు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బివి.సత్యనారాయణ, డంపింగ్ యార్డ్ హెచ్ ఐ ఎం ఎస్ డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, చర్లపల్లి బీపీసీఎల్ యూనిట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్, ఉపాధ్యక్షులు షరీఫ్, మల్లేష్ , సంయుక్త కార్యదర్శులు ఆంజనేయులు నాగస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి చెన్నకేశవులు, సభ్యులు మహేష్, రాజారెడ్డి, ఖాజ, కుమారస్వామి, నాగరాజు, గంగాధర్ పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గ్రామానికి చెందిన బుసిగంపల సురేష్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తనతోపాటు చదువుకున్న పదో తరగతి 200506బ్యాచ్ కి చెందిన విద్యార్థులు విషయం తెలుసుకున్నారు. మృతి చెందిన స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. స్నేహితుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేష్ భార్యా, పిల్లలకు రూ.33,500ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి స్నేహితులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ రెండవ సమావేశం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ రెండవ సమావేశం గురువారం నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుడగం. మహేష్ నాయకత్వం వహించారు. సమావేశంలో క్రికెట్ అభివృద్ధి, అకాడమీ విద్యార్థుల భవిష్యత్ ప్రగతికి అవసరమైన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించబడింది.అసోసియేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలు, పిల్లల కోసం జాతీయ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. అందులో భాగంగా, ఉన్నత ప్రమాణాల ఆధారంగా శిక్షణ ఇవ్వడం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాల కల్పన వంటి అంశాలపై విశ్లేషణ జరిపారు.ఇటీవలి కాలంలో వైస్ ప్రెసిడెంట్ డా. బి. ఎస్. రావు తన వృత్తిరీత్యా, వ్యక్తిగత కారణాల వలన బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు తెలియజేశారు. దీనిపై సభ్యులందరూ చర్చించి, సింగరేణి సంస్థలో డివైజియం ఆర్ అండ్ డి లో పని చేస్తున్న సునీల్ వర్మ ని వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ వర్మ మాట్లాడుతూ, "అసోసియేషన్ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో నేను నా వంతు బాధ్యతగా పని చేస్తాను," అని చెప్పారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, బి కే డి సి ఏ సభ్యులు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట :జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మనగర్‌లో గురువారం బొడ్రాయి గ్రామ దేవత మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే వందలాది మహిళలు తరలి వచ్చి బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కలశ పూజ, గణపతి పూజ, నవగ్రహాల పూజ అనంతరం బొడ్రాయికి పసుపు, కుంకుమ, గంధాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం చేసి అమ్మ వారిని ప్రత్యేకంగా వఅలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమం లో కార్పొరేటర్ కొలుకుల జగన్,మైసమ్మ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మానందచారి, బిజేపి నాయకులు మహేందర్, బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

*** సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థుల పోస్ట్ కార్డు ఉద్యమం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పి.డి. ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధానమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డుల ద్వారా వినతి పత్రాలు పంపారు. ఈ కార్యక్రమం బుధవారం కొత్తగూడెం పట్టణంలోని జూనియర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గణేష్ మాట్లాడుతూ, విద్యా రంగ అభివృద్ధిని ప్రధాన ఎజెండాగా చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.8,000 కోట్ల మేర స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు.

**సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తపన**

పెండింగ్ రీయింబర్స్మెంట్ల కారణంగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీంతో విద్యాభవిష్యత్తు తారుమారు అవుతోందని గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. "అందాల పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వానికి నిధులు ఉన్నాయి కానీ విద్యార్థుల భవిష్యత్తు కోసం మాత్రం నిధులు లేవా?" అని ప్రశ్నించారు. ఆందోళనలైనా తప్పవు విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే గతంలో కెసిఆర్ ప్రభుత్వానికి వచ్చిన గతి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని గణేష్ హెచ్చరించారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, రీయింబర్స్మెంట్ మొత్తాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు జరుగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా నాయకురాలు వి. భార్గవి, వి. సరిత, బి. వరుణ్, బి. అరుణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలి

*** ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య**



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : గురువారం రోజు కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో అన్ని మండలాల స్పెషల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమీషనర్ లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ ఇందిరమ్మ ఇండ్లపై దృష్టి పెట్టాలన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టిన ఇండ్లు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కట్టుకునే వాళ్లకి మట్టి, ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రగామి గా ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు.లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని అధికారులను కోరారు. ఒక్కో మండలం వారీగా కేటాయించిన లబ్ధిదారుల ఇండ్ల మంజూరీ చేసిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను ఆరా తీశారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రౌండింగ్ విషయంలో వెనుకంజలో ఉన్న మండలాలను గుర్తించి, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని విప్ సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు. బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వారికి ప్రతి సోమవారం లక్ష రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జడ్పీ సీఈఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,హౌసింగ్ పీడీ విజయసింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రామవరంలో చీటికిమాటికి విద్యుత్ అంతరాయం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ఇదేమి కోతలు రా బాబోయ్ .. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సభలు సమావేశాలలో ప్రజా ప్రతినిధులు చెప్తుంటే.. దానికి భిన్నంగా ఉంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితి..కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో ప్రజలు నిత్యం విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారం రాలేదు.. ఉరుములు మెరుపులు మెరవలేదు. భారీ వర్షం కురవలేదు మరెందుకు ఈ విద్యుత్ అంతరాయం..!!ఇలాంటి వేడెక్కిన వాతావరణంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయినా విద్యుత్ శాఖ మాత్రం ఏదో ఒక సాకు చూపుతూ ప్రజలకు షాకులు ఇస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకూ లెక్కలేనన్ని సార్లు కరెంట్ వచ్చిపోతూ ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది.ఇలాంటి తరచూ వచ్చే విద్యుత్ అంతరాయం వల్ల ఫ్యాన్స్, ఫ్రిజ్‌లు, ఇంటర్నెట్ డివైజ్‌లు పని చేయక ప్రజలు విసుగు చెందుతున్నారు. అసలు ఎందుకు ఇలా జరుగుతోందో తెలియక విద్యుత్ శాఖపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వింతగా మారుతున్న వాతావరణం మనిషికి కాస్తనైనా ఉపశమనమివ్వాలి కానీ, కరెంట్ లేకపోవడం మరింత తలనొప్పిగా మారిందని ప్రజలు చెబుతున్నారు.విద్యుత్ సమస్య విషయంపై రామవరం సబ్ స్టేషన్ లో ఉన్న సిబ్బందిని అడగగా విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తెగిపడ్డాయని సమాధానం ఇచ్చారు..

## చర్లపల్లి డివిజన్‌లో రోడ్ సేఫ్టీ డ్రైవ్ ప్రారంభం

*** గుంతల రోడ్లకు పరిష్కారంగా స్పెషల్ టీం ద్వారా ప్యాచ్ వర్క్లు**




ప్రజాస్పూర్తి , కాప్రా : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ సేఫ్టీ డ్రైవ్ చర్లపల్లి డివిజన్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు నేమూరీ మహేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేమూరీ మహేష్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు పాత హోల్స్ గా మారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిహెచ్ఎమ్ సి ప్రత్యేకంగా స్పెషల్ టీంను ఏర్పాటు చేసింది. ఈ టీం ద్వారా డివిజన్ అంతటా రోడ్లపై సిమెంట్ కాంక్రీట్ ప్యాచ్ వర్క్‌లు చేపడతాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి అశోక్, గోపాల్ యాదవ్, జగన్ మోహన్ రెడ్డి, వెంకట్, రవీందర్ అధికారులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హక్కుల కోసం వినతిపత్రం

*** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత**

ప్రజాస్పూర్తి , కాప్రా :మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌బీ కాలనీ నాల్గో డివిజన్, కైలాసగిరి చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద, తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కైలాసగిరి, నవోదయ నగర్, రాజీవ్ నగర్ కాలనీలలో నివాసముంటున్న ఉద్యమకారులు రామచర్ల బాల నరసయ్య, పంగ యాకుబ్, కటకే మోహన్, పాకాల ఎల్లయ్య, ఎర్రా శ్యాంసన్, బొల్లం జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమ హామీలు నెరవేర్చాలని కోరుతూ, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు రామచర్ల బాల నరసయ్య మాట్లాడుతూ తెలంగాణ కోసం తొలిదశ ఉద్యమంలో 369 మంది తుపాకి తూటాలకు బలయ్యారు. మలిదశలో 1200 మంది యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. ఉద్యమంలో పాల్గొన్నవారు శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారు. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ ప్రస్తుతం ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

* **ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య**

ఆలేరు ప్రజాస్ఫూర్తి : మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యన్నారు. గురువారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఆలేరు నియోజగవరంలోని ఆలేరు పట్టణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వై ఎస్. ఎన్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు పాల్గొన్నారు.ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమం మొదలుపెట్టిన ముందుగా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు చేయడమే ముఖ్యమంత్రి గారి ఆలోచన అని అందుకు ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమానికి మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చాక మహిళలకు అనేక రంగాలలో ముందు ఉంచామని, మహిళలకు వడ్డీ లేని రుణాలు, నియోజకవర్గంలో 50 శాతం ఐ. కే. పి సెంటర్ లు కూడా మహిళల కే ఇవ్వడం జరిగిందన్నారు. ఇవన్నీ మహిళలతోనే సాధ్యమన్నారు.ప్రభుత్వం వచ్చిన మొదటిలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. మహిళలకు 200 ఉచిత కరెంట్, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇచ్చి మహిళలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం బస్సుల యాజమాన్యులుగా మహిళలను చేయబోతుందన్నారు. పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. కరెంటు ఉత్పత్తి అయ్యేందుకు సోలార్ పవర్ ప్లాంట్లు మహిళలకు ప్రభుత్వమే భూమి ఇచ్చి అలకేషన్ చేసి మహిళలను చేయాలని ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. మహిళా సంఘాలు బలోపేతం చేయడానికి గతంలో 18 నుంచి 20 సంవత్సరాలు ఉంటే ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు 15 నుంచి 62 సంవత్సరాల వరకు సభ్యత్వం ఇస్తున్నామన్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే 10 లక్షలు మహిళలకు ప్రమాద బీమా కింద ఇవ్వడం జరుగుతుంది అన్నారు . ఎవరైనా చనిపోతే బ్యాంకులో రుణం ఉన్న కూడా ప్రభుత్వమే కట్టి మహిళలకు పెద్ద పీట వేయడానికి ప్రభుత్వం మహిళలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదనే ఇచ్చామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అతి పేద రికం తో ఉంటే మహిళా సంఘాల ద్వారా లోన్ లు ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకెళ్తున్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వెంటనే లక్ష రూపాయలు ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, తదుపరి పిల్లర్ లెవెల్,స్లాబ్ లెవెల్ పూర్తయిన తర్వాత డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. ఇల్లు త్వరగా పూర్తి చేసుకున్న వారికి గృహప్రవేశానికి నూతన వస్త్రాలు పెట్టి గొర్రె పొట్టేలు ఇస్తున్నానని అందుకు లబ్ధిదారులు త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఇంట్లో మహిళ ఆర్థికంగా పెరిగితే కుటుంబం అంతా సంతోషంగా ఉంటారన్నారు. ప్రభుత్వం ప్రతి పేద వారు కడుపు నిండా తినాలనే లక్ష్యంతో కొత్త రేషన్ కార్డులు కూడా ఇచ్చామన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ తల్లుల బోనాల జాతరకు ఆహ్వానం




ప్రజాస్ఫూర్తి , కాప్రా: కుషాయిగూడలో ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా జరగే శ్రీ ముత్యాలమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ తల్లుల బోనాల జాతర ఈ ఏడూ ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను, బోనాల జాతరలో పాల్గొనాలని కోరుతూ, పోచమ్మ తల్లి ఆలయ పూజా కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు.ఈ పూజా కమిటీ సభ్యుల్లో నాలచెరువు ఈశ్వరయ్య, నాలచెరువు జనార్దన్, విశాల్, రమేష్, మధు, నితిన్ తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణలు నిర్వహించనున్నారు.

## మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మంగలి రమేష్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. బిజెపి జిల్లా నాయకులు శీలం రాజు గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సెల్ సభ్యులు మెరుగు అంజా గౌడ్, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, కరుణాకర్, నాగరాజు, మంగలి బాలయ్య, శ్రీనివాస్, నారాయణ తదితరులున్నారు.

## నల్లపోచమ్మ ఆలయ సింహ ద్వారం ప్రారంభం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గం సంగీత్ నగర్ లో వెలసిన శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవి అమ్మవారి ఆలయ సింహ ద్వారాన్ని ఆలయ దాతలు దివంగత మాధవరం సుదర్శన్ రావు జ్ఞాపకార్థం నిర్మించారు.అమ్మవారి ఆలయం సింహ ద్వారాన్ని గురువారం మాధవరం అభిలాష్ రావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమ్ము సత్తయ్య, ఆలయ అధ్యక్షులు కొమ్ము రాజు, రాజ్ కుమార్, శివశంకర్, చావ రవి, దేవేందర్, నారాయణ, చందు కిష్టయ్య, గోవిందు, శంకర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట ప్రజలు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎంఎంటీఎస్ రైలు కల తీర్చిన దేశ ప్రధాని



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి గురువారం పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ పాలాభిషేకం చేయడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ మాట్లాడుతూ భువనగిరి జిల్లా మరియు యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల యొక్క ప్రజలు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎంఎంటీఎస్ రైలు కల తీరింది దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఘట్కేసర్ నుండి రాయగిరి వరకు సుమారు 33 కిలోమీటర్లు ఎంఎంటీఎస్ రైలు పనులను ప్రారంభించింది దీనికిగాను 412 కోట్ల నిధులను కేటాయించి మొదటి దఫాగా 100 కోట్లను విడుదల చేస్తున్నట్టు రైల్వే శాఖ మంత్రి రమణ సింగ్ తెలిపారు దీనివలన కేవలం ₹20 చార్జీతో ఒక గంట సమయంలో హైదరాబాద్ నుండి యాదగిరిగుట్టకు చేరుకోవచ్చు ఇది యాదగిరిగుట్ట కి వచ్చేటువంటి భక్తులకు మరియు చుట్టుపక్కల గ్రామాలకు ప్రయాణం ఎంతో సులువుగా ఉంటుంది అప్పుడు ఉన్నటువంటి టిఆర్ఎస్ ప్రభుత్వం గాని ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం గానీ భూమి సేకరించకపోవడం వల్ల ఇన్ని రోజులు పనులు ఆలస్యం జరుగుతూ వచ్చాయి ఇక లాభం లేదని కేంద్రమే పూర్తి నిధులు కేటాయించి ఈ యొక్క ప్రాజెక్టును చేయడానికి ముందుకు వచ్చింది దీనికి మేము హర్షం వ్యక్తం చేస్తున్నాం ఈ యొక్క క్రెడిట్ ని తమ ఖాతాలో వేసుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నించడం హాస్యస్పదంగా ఉంది అలాగే రాయగిరి రైల్వే స్టేషన్ కూడా ఆధునికరం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మందుజు నరేష్ జెల్ల భానుచందర్ కోశాధికారి మిట్ట వీరేష్ కార్యదర్శి లు ఆలేటి కర్ణ ,ఆవుల సత్యనారాయణ, పలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు నల్ల వెంకటరెడ్డి ,రంగసత్యం, బందారపు మల్లేష్ ,దొమ్మాట నరేష్ ,సుదు రాజిరెడ్డి ,రుద్రాక్ష నవీన్, శ్రీకాంత్ ,భాను ,నాగేందర్ కుమార్ ,ప్రశాంత్ ,మధు ,సాయి ,సంద ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన వీరబాబు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పసుపులేటి వీరబాబు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా, పలు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్యకలాపాల ఇన్చార్జిగా, కొత్తగూడెం ,ములుగు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బాధ్యునిగా, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ విధేయుడినిగా పేరున్న ఆయనను గ్రంథాలయ చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలకడం తో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె వీరబాబుకు జిల్లా గ్రంథాలయ ఉద్యోగులను పరిచయం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలను త్వరలో పరిశీలిస్తానని, ఆయా గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలతో సమానమని, అలాంటి దేవాలయాలను సంపూర్ణంగా తీర్చిదిద్ది ఉద్యోగులు సిబ్బంది సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. అంతా కలిసిమెలిసి పని చేద్దామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి పాఠకులకు అనుకూలమైన వాతావరణాన్ని గ్రంథాలయాల్లో మరింతగా ఏర్పాటు చేద్దామని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్, గ్రంథ పాలకులు జి. మణి మృదుల, నాగన్న, మధుబాబు అశ్వరావుపేట నియోజకవర్గ బీసీ సంఘం యువజన అధ్యక్షులు పల్లె వరప్రసాద్, లక్ష్మీదేవి పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జల్లారపు ఈశ్వర్, భద్రాద్రి బీసీ సంఘం ఉపాధ్యక్షులు బండి శ్రీకాంత్ గౌడ్, లక్ష్మీదేవి పల్లి మండలం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లావుడియా నరేష్ తో పాటు తదితరులున్నారు.

## అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




ప్రజాస్ఫూర్తి , కాప్రా : ఉప్పల్ నియోజకవర్గంలోని బోనాల పండుగ నిర్వహణతో పాటు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమావేశానికి కాప్రా డీసీ జగన్ అధ్యక్షత వహించారు. బోనాల పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ఉప్పల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దవచ్చు. ప్రజలకు అందుబాటులో ఉండాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలను విభాగాల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలి అని సూచించారు. ప్రతి శాఖ అధికారి తన డివిజన్లలో ప్రత్యక్షంగా పర్యటించి, శుభ్రత, వీధి దీపాలు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, ఏసీపిలు చక్రపాణి, వెంకట్ రెడ్డి, జిహెచ్ఎమ్ సి ఈ ఈ నాగేందర్, వాటర్ వర్క్స్ ఎమ్ డి సంతోష్, పలు శాఖల అధికారులు, బోనాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రామవరం రిజర్వు అటవీ ప్రాంతంలో విత్తనాలు జల్లిన ఎన్.సి.సి. విద్యార్థులు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విత్తనాలను సేకరించారు. కొత్తగూడెం మండల పరిధిలో సేకరించిన సుమారు 40 కేజీల గానుగ, వేప, టేకు తదితర గింజలను మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ నేతృత్వంలో ఆనందఖని పాఠశాలకు చెందిన ఎన్.సి.సి విద్యార్థులు రామవరం రిజర్వు అటవీ ప్రాంతంలో గురువారం విరివిగా జల్లారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఎన్.సి.సి ఇన్చార్జి ఆఫీసర్ వీరు, హెచ్ఎం లక్ష్మి , ఉపాధ్యాయులు రమేష్, ఎన్.సి.సి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## భయం.. భయంగా...!

* **గంజాయి మత్తులో యువత వీరంగం!:**
* **భయందోళనలో చంద్రగిరి నగర్ వాసులు!:**
* **మత్తులో ట్రాన్స్ఫార్మర్ బాక్స్ తొలగించే యత్నం!:**
* **జగద్గిరిగుట్ట పోలీసులు దృష్టిసారించాలంటున్న స్థానిక ప్రజలు!**






ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట :రాత్రి అయితే చాలు తమ ఇండ్ల ముందు గంజాయి మత్తులో యువకులు గుంపులు గుంపులుగా తిరుగుతూ నానా హంగామా చేస్తున్నారని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్ర గిరి నగర్ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు!చీకటి పడితే చాలు ఇండ్ల నుండి బయటకు వెళ్లాలంటేనే స్థానిక ప్రజలు బయపడుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో విధ్యుత్ సరఫరా ఉండగానే ట్రాన్స్ ఫార్మర్ బాక్స్ ను లాగుతూ నానా హంగామా చేసారని, ఆ సమయంలో అక్కడ పది మందికి పైగా యువకులు వున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.తమ బస్తిలో యువకులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నట్టుగా స్థానికులు ప్రజాస్ఫూర్తి దృష్టికి తీసుకువచ్చారు. పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసినా, గంజాయి వంటి మత్తు పదార్ధాల సరఫరాపై ఎంతటి నిఘా ఉంచినా ఎదో ఒక చోట గంజాయి మత్తులో ఆకాతాయిల అరాచకాలు మాత్రం ఆగడం లేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మరింత పటిష్టం గా నిఘా, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని చంద్రగిరి నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.రోజు రోజుకు యువత పెడదోవ పడుతున్న తరుణంలో గంజాయి మహమ్మారి వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు అర్థం అయ్యే రీతిలో ఎక్కడికక్కడ బస్తిలు, కాలనీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం వుంది.లేదంటే దారి తప్పిన కొందరు యువకులు గంజాయి, డ్రగ్స్ కు బానిసలుగా మారి కోటి అశలు తమపైనే పెట్టుకున్న తమ తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేస్తూ తమ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకునే పరిస్థితి నెలకొంది!వారితో ఏ మాత్రం సంబంధం లేని అమాయక ప్రజలపై అకారణంగా దాడి చేసే ప్రమాదం పొంచి వుంది! తమ ఇండ్ల సమీపంలో గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే వెనువెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత పౌర సమాజంపై వుంది. లేదంటే దూరంగా అంటుకున్న గంజాయి కార్చిచు ఎదో ఒకరోజు మీ ఇంటిని కూడా దహించవచ్చు.మీ పిల్లలు కూడా విషపు మత్తుకు బానిసలుగా మారవచ్చు జాగ్రత్త!

# రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

*** శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకొవాలని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు.గురువారం శామీర్ పేట మండలంలోని అలియాబాద్‌లోని శుభం పంక్షన్ హాల్‌లో సెర్ప్, మెప్మా ఆద్వర్యంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల లో చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. బ్యాంక్ లింకేజీ కింద 619 స్వయం సహాయక సంఘాలకు రూ. 38 కోట్ల 86 లక్షలు, 5 మండలాలకు 3698 స్వయం సహాయక సంఘాలకు సభ్యులకు వడ్డీ రాయితీ కింద కోటి 79 లక్షలు, 5 మంది మహిళలకు లోన్ భీమా కింద 3 లక్షల 19 వేల విలువగల చెక్కుల మేడ్చల్ శాసన సభ్యులు సిహెచ్. మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి లతో కలిసి చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులుగా చేయటకు దృడ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వము అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు బస్సులిచ్చి కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం కల్పించామని తెలిపారు. 200 యూనిట్ కరెంట్ ఉచితంగా ఇస్తున్నాం. అలాగే జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ లు నడిపించే బాధ్యత అప్పగించామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో వాటిని నిర్వహించే బాధ్యత ఇచ్చామన్నారు. గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి రూ. 5 లక్షల వరకు అందిస్తున్నామని తెలిపారు, . స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించే విధంగా కృషి చేశామని ఆయన తెలిపారు. గతంలో మహిళలను లక్షాదికారులను చేయాలని లక్ష్యం కాగా ప్రస్తుత ప్రభుత్వము కోటీశ్వరులను చేయాలని కృత నిశ్చయంతోపనిచేస్తుందని తెలిపారు. ఇందుకు అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేందుకు ప్రస్తుతం ఉన్న సభ్యులు, సంఘాంలో చేరితే వచ్చే లాభాలగురించి క్షుణ్ణంగా వివరించి



నూతన సభ్యులకు సభ్యత్వం కల్పించాలని సూచించారు. మహిళలు నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకొని అందుకు తగిని విధంగా ప్రణాళికను సిద్దం చేసుకుని, లక్ష్యాలను సాధించేందుకు మరింత కష్టపడాలని ఆయన తెలిపారు. చిన్న వ్యాపారమే కదా అని అనుకోకుండా, నిరంతరం కృషి చేస్తే మున్ముందు ప్రగతి సాధించడం పెద్ద కష్టం కాబోదని, తద్వారా ఆర్థికంగా ఎదుగుటకు దోహదపడుతుంది ఆయన సూచించారు. ఎమ్మెల్యే చామకూర మాల్లారెడ్డి మాట్లాడుతూ ధైర్యే సహాసే లక్ష్మి,, ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 36 వేల స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఉన్నారని, అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూపులలో చేర్పింటకు కృషి చేయాలన్నారు. మహిళల స్వాలబన కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందని సూచించారు. ప్రపంచ దేశాలలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి మట్లాడుతూ మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువును అమ్ముకొనుటకు ప్రభుత్వ అవకాశాలు కల్పిస్తుందని, తద్వారా వచ్చే లాభాలను వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇంట్లో బాధ్యతలు నిర్వహణలో మహిళలే రోల్ మోడల్‌గా ఎదుగుతున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు వ్యాపారం చేసేందుకు కావల్సిన శిక్షణలు ఇస్తామని తెలిపారు. వారు ఎ రంగంలో కావాలంటే ఆ రంగంలోనే శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ మహిళ ఆర్థిక అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తుందని తెలిపారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమీటీలు బాధ్యతకూడా మహిళలకు అప్పగించామని అన్నారు. పాఠశాలలో యూనిఫామ్స్ కుట్టుటకు వారికే అప్పగిస్తే నిర్దేశించిన సమయంలోపు బట్టలను కుట్టి అప్పగించడం అభినందనియమని ఆయన అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఐకేపి సంఘాల కు వడ్ల కొనుగోలులో ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు రాష్ట్రం ,దేశం మొత్తం బాగుంటదని ఆయన వివరించారు. అత్యదికంగా మహిళలు పనిచేస్తున్న దేశాలు అభివృద్ధిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహిళా సంఘాల ద్వారా లబ్ధిపొందిన మహిళా సభ్యులు తమ తమ అనుభవాలను తెలియజేసారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధులు ఇందిరా మహిళా శక్తి పై పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా , వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింగ్ యాదవ్, గ్రందాలయ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఇంచార్జీ డిఆర్‌డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజయలక్ష్మి, తహాశీల్దార్, యంపిడిఓ, అలియాబాద్ మున్సిపల్ కమీషనర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సెర్ప్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వే మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ చామల



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు శ్రీధర్ బాబు , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి కొత్త రైల్వే లైన్లు , ఇతర అభివృద్ధి గురించి చర్చించారు.రైల్వేల పూర్తి నిధులతో ఘట్కేసర్ నుండి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణ పనులను ప్రారంభించడానికి 100 కోట్ల తక్షణ ఆమోదంతో 412 కోట్ల రూపాయలు ఆమోదించినందుకు కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తన తరుపున , భువనగిరి పార్లమెంట్ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నవతెలంగాణ బుక్ హౌస్ సందర్శించిన రూరల్ ఎస్సై అనిల్ కుమార్

యాదాద్రి భువనగిరి ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నవతెలంగాణ బుక్ హౌస్ ని భువనగిరి రూరల్ ఎస్సై అనిల్ కుమార్, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ లు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ బుక్ హౌస్ ఆధ్వర్యంలో పుస్తకం ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఆయనతోపాటుగా యువజన కాంగ్రెస్ బృందం సభ్యులు సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కొత్త రాజశేఖర్ రెడ్డి, గంగాదేవి బాలరాజ్, సాల్వేరు ఉపేందర్, దయ్యాల శ్రీశైలం, సరగడ కరణ్, మూలయం సింగ్ యూత్ బ్రీ గ్రేడ్ అధ్యక్షులు మేకల బాలు యాదవ్, సామాజిక నాయకులు రాసాల దయాకర్,నవతెలంగాణ నవతెలంగాణ బుక్ హౌస్ రాష్ట్ర జనరల్ మేనేజర్ వాసు,నవతెలంగాణ జిల్లా రిపోర్టర్ పాక జహంగీర్, ఉస్మాన్ షరీఫ్, ఉమ్మడి నల్గొండ జిల్లా బుక్ హౌస్ ఇంచార్జ్ రఘువరన్ లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఖమ్మంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలు చూడకుండా ప్రతీ పేదోడికి ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఎక్కడా రాజీ పడకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం బెల్టు షాపులు పెట్టిస్తే.. తాము వచ్చాక రేషన్ షాపులు పెట్టిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 5.20 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా చెల్లించి రైతులను ఆదుకున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల్లో భరోసా కల్పించినట్లు తెలిపారు. మరో నాలుగైదు నెలల్లో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కీలక ప్రకటన చేశారు. అంతకుముందు అశ్వరావుపేట పట్టణాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, సుందరీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం అశ్వరావుపేట రింగ్ రోడ్ నుంచి దొంతికుంట చెరువు వరకు మార్నింగ్ వాక్ చేశారు. ప్రజలను పలకరిస్తూ వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారం కోసం 90 రోజుల పాటు మధ్యవర్తిత్వం డ్రైవ్

*** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్**

ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించడానికి జులై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 90 రోజులపాటు మధ్యవర్తిత్వం డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ , కార్యదర్శి ఎం. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశం కోసం మీడియేషన్ అనే పేరుతో ఈ డ్రైవ్ ను నల్సా, న్యూఢిల్లీ , సుప్రీంకోర్టు యొక్క మీడియేషన్ అండ్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ సంయుక్తంగ నిర్వహిస్తుందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం, సత్వర న్యాయ పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ మధ్యవర్తిత్వంలో వివాహ బంధానికి సంబంధించిన వివాదాలు, ప్రమాద క్లైమ్ లు, గృహ



హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ , క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, రుణ రికవరీ కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## మన భావాలను సంక్షిప్తంగా తెలుపడమే ఎమోజి

*** ట్రినిటీలో ప్రపంచ ఎమోజీ దినోత్సవం**
*** విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:మన భావాలను ముఖ కవళికల ద్వారా సంక్షిప్తంగా ఎదుటి వ్యక్తులకు తెలియజేయడమే ఎమోజి అని ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో ప్రపంచ ఎమోజీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ కేవీ బికృష్ణారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ ఎమోజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్పర్ కేజీ విద్యార్థినీ, విద్యార్థులకు ఆహ భావాలు ఏ విధంగా ముఖ కావలికలతో తెలుపాలో నేర్పించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉజ్జని మంజుల మాట్లాడుతూ ముఖ కవళికలలో ఆహాభావాలను, భావోద్వే గాలను నేర్చుకొని తెల్పడంలో ఉన్న సంతోషాన్ని చిన్నారి విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించడం అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చిరునవ్వు, వేడుకల



సంబరాలు, ఆనంద భాష్పాలు, పగలబడి నవ్వడం, విచారం, బాధ నోరు మెదపకపోవడం, కోపం, చిరాకు, ఆలోచించడం, ఏడవడం, బిగ్గరగా ఏడవడం, రుచిగా ఉందని తెలపడం, సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కడం, నిద్రపోవడం, చిలిపితనం సిగ్గు పడడం లాంటి భావాలను ముఖ కవళికలతో ప్రదర్శించిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భావోద్వేగాలను నేర్పిన సమన్వయకర్తలు లోవకుమారి, పూజిత, సుమలత, భార్గవి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బియ్యానికి దేశంలో హై డిమాండ్

**: ఎంపీ డి.కె.అరుణ**

రాష్ట్రంలో భారత ఆహార సంస్థ ద్వారా సేకరించిన బియ్యం 8 రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నామని, దేశ వ్యాప్తంగా తెలంగాణ బియ్యనికి చాలా డిమాండ్ ఉన్నదని FCI కన్సల్టెటివ్ కమిటీ చైర్ పర్సన్ ఎంపీ. డి. కె. అరుణ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ కన్సల్టెటివ్‌కమిటీ తొలి సమావేశం హకా భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఎఫ్‌సీఐ పనితీరు,గోడౌన్ల నిర్వహణ, ధాన్యం సేకరణలో ఇబ్బందులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై సమావేశంలో అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. ఏటేటా రాష్ట్రంలో భారీగా ధాన్యం సేకరణ పెరుగుతోందని, మన బియ్యానికి మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు చాలా మంది ఇష్టపడుతారని తెలిపారు. తెలంగాణలో ప్రధానంగా గోడౌన్ ల సమస్య ఉందని, ధాన్యం సేకరణ పెరుగుతున్న నేపథ్యంలో ధాన్యం నిల్వల కోసం గోదాములు అవసరం చాలా ఉందన్నారు. గతం కంటే మద్దతు ధర పెరగడంతో రైతులు పెద్ద ఎత్తున ఎఫ్‌సీఐకి ధాన్యాన్ని అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణను రాష్ట్రాలకే అప్పజెప్పింది. ధాన్యం సేకరణ కోసం అవసరమైన పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ధాన్యం నిల్వల కోసం అవసరమైన చోట గోదాముల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. శక్తి వంచన లేకుండా తెలంగాణాలో భారత ఆహార సంస్థ అభివృద్ధికి సాయంశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎఫ్‌సీఐ ద్వారా రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నా సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందిస్తానని చెప్పారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణ కన్సల్టెటివ్ కమిటీ ఛైర్మెన్ గా బాధ్యతలు అప్పగించిన కేంద్రం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ఈవెంట్ ఆడియోస్ అధినేత శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ప్రధాన రహదారిపై ఈవెంట్ ఆడియోస్ అధినేత శ్రీనివాస్ (చిన్న) పుట్టినరోజు వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, సీనియర్ ఉద్యమ నాయకులు చిందం బాల నరసింహ వంశరాజ్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అరవింద్, ప్రవీన్, మల్లేష్, నితిన్, నవీన్, అనిల్ తదితరులు పాల్గొని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.

## ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పిటిషన్.. విచారణ వాయిదా



ఓఎంసీ కేసు లో తెలంగాణ హై కోర్టులో శ్రీలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆమె దాఖలు చేసిన పిటిషన్ పై ఈ రోజు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువర్గాలు వాదనలు వినిపించారు. సీబీఐ తరఫున పీపీ శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓఎంసీకి మైనింగ్ లీజు అప్పగించారని తెలిపారు. ఓఎంసీకి లీజు కేటాయించేలా శ్రీలక్ష్మి చొరవ తీసుకున్నారని చెప్పారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి లీజు వచ్చేలా చూశారని వాదించారు. శ్రీలక్ష్మి అక్రమాలకు పాల్పడ్డారనడానికి ఆధారాలున్నాయని వివరించారు. సాక్ష్యాధారాలు పరిశీలించాకే సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చిందని సీబీఐ పీపీ శ్రీనివాస్ కపాటియా హైకోర్టులో వాదనలు వినిపించారు. శ్రీలక్ష్మి తరపున వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు విచారణను శుక్రవారానికి (రేపటికి) వాయిదా వేశారు.

## సచివాలయ ప్రాంగణంలో ఘనంగా బోనాలు



హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సచివాలయం బయట ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలో పలువురు సచివాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేకంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. సచివాలయం ప్రాంగణం నార్త్ గేట్ నుండి ప్రారంభమైన ఉత్సవాల ఊరేగింపు బాహుబలి గేట్, సౌత్ గేట్ ద్వారా నల్ల పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. ఈ ఊరేగింపులో డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలతో పలు కళారూపాలకు చెందిన కళాకారులు పాల్గొని తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ ఉత్సవాలలో తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, లావణ్య లత, జనరల్ సెక్రటరీ ప్రేమ్, అదనపు కార్యదర్శి రాము భూక్య, నల్ల పోచమ్మ దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు.. స్పందించిన బండి సంజయ్

* కేసీఆర్ చేసిన పాపాల వల్ల నోటీసులు వచ్చాయన్న బండి సంజయ్
* తనతో పాటు కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపణ
* తనకు తెలిసిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానన్న బండి సంజయ్

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన పాపాల కారణంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నుంచి తనకు నోటీసులు వచ్చాయని



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ నెల 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలంటూ జూబ్లీహిల్స్ ఏసీపీ ఆయనకు లేఖ రాశారు. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి హైదరాబాద్‌లోని లేక్ వ్యూ అతిథి గృహానికి రావాలని సూచించారు. ఈ లేఖపై బండి సంజయ్ స్పందిస్తూ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి తనకు నోటీసులు వచ్చినట్లు తెలిపారు. తనతో పాటు తన కుటుంబం, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. పడకగదిలో దంపతుల మాటలను కూడా ట్యాప్ చేసి జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. తనకు తెలిసిన, తన వద్ద ఉన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానని ఆయన అన్నారు.

## హైదరాబాద్‌లో బాక్సింగ్ పోటీల్లో ఉద్రిక్తత.. బాక్సర్లు, కోచ్‌ల ఘర్షణ

* షేక్‌పేటలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు
* రిఫరీ తప్పుడు నిర్ణయం కారణంగా ఓడిపోయానంటూ ఓ బాక్సర్ వర్గీయుల దాడి
* తలుపులు, కిటికీలు ధ్వంసం




హైదరాబాద్ నగరంలోని షేక్‌పేటలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు గురువారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. పోటీల మధ్యలో బాక్సర్లు, కోచ్‌ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇద్దరు బాక్సర్ల మధ్య బౌట్ జరుగుతున్న సమయంలో ఈ వివాదం తలెత్తింది. రిఫరీ తప్పుడు నిర్ణయం కారణంగానే తాను ఓటమి పాలయ్యానంటూ ఒక బాక్సర్ వర్గం అతడిపై దాడికి పాల్పడింది. ఈ ఘర్షణలో తలుపులు, కిటికీలు ధ్వంసం అయ్యాయి. అనంతరం ఇరు వర్గాలు గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి.

## నాపై ఒక్క డ్రగ్స్ కేసైనా ఉందా.. రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

* తనకు డ్రగ్స్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్న
* ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్
* అసత్య ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డిని కోర్టుకు లాగుతానని హెచ్చరిక

"నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదై ఉందా? అలాంటి కేసులతో నాకు సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయా? అలాంటివి ఏమైనా ఉంటే



దమ్ముంటే బయటపెట్టు" అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నేరుగా తన ముందు నిలబడే ధైర్యం లేక చిట్‌చాట్లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్‌చాట్ పేరుతో తనపై అసత్య ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడటం రేవంత్ రెడ్డికి ఇది కొత్తేమీ కాదని విమర్శించారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డిని కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. తప్పుడు ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. క్షమాపణలు చెప్పకుంటే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## కేసీఆర్ కుటుంబంపై కోర్టులకు వెళతాం: తీన్మార్ మల్లన్న

* బీఆర్ఎస్ పోవడం వల్లే ఫోన్ ట్యాపింగ్ బయటపడిందన్న తీన్మార్ మల్లన్న
* ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలని డిమాండ్
* తన వద్ద ఉన్న ఆధారాలను సిట్ అధికారులకు అందించానని వెల్లడి

బీఆర్ఎస్ ప్రభుత్వం పోవడం వల్లే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటపడిందని... లేకపోతే ఆ అరాచకం ఇప్పటికీ కొనసాగేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. కేసీఆర్ తో పాటు ఈ దారుణానికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు. సిట్ పిలుపుతో తీన్మార్ మల్లన్న ఈరోజు విచారణకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా మల్లన్న స్టేట్మెంట్ ను సిట్ అధికారులు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం మీడియాతో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం తనతో పాటు పలువురి ఫోన్లను ట్యాప్ చేసిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించానని... తన వద్ద మరికొంత సమాచారం ఉందని, అది త్వరలోనే అధికారులకు పంపిస్తానని చెప్పారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని అధికారులు చెప్పారని తెలిపారు. వ్యక్తిగత హక్కులను హరించిన కేసీఆర్ కుటుంబంపై, అప్పటి అధికారులపై చర్యల కోసం కోర్టులను



ఆశ్రయిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడేనని... ఈ ప్రభుత్వంలో అలాంటి దుర్మార్గాలు జరగవనే సంకేతాలను ప్రజలకు ముఖ్యమంత్రి ఇవ్వాలన్నారు. ఈ కేసులో సిట్ ఏ మేరకు న్యాయం చేయగలదో చూస్తామన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రేసులో ఉన్నాను : అంజన్ కుమార్ యాదవ్

* పార్టీ కోసం పని చేస్తూ టిక్కెట్ ఎందుకు ఆశించకూడదన్న అంజన్ కుమార్
* తన కొడుకుకు ఎంపీ టిక్కెట్ ఊరికే రాలేదన్న కాంగ్రెస్ నేత
* బీసీ సామాజిక వర్గం నుంచి టిక్కెట్ ఆశిస్తున్నానన్న అంజన్ కుమార్



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రేసులో తాను కూడా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నందున టిక్కెట్ ఆశించే హక్కు తనకు ఉందని ఆయన అన్నారు. తన కుమారుడు సైతం పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, అందుకే ఎంపీగా ఎన్నికయ్యారని, అతనికి టిక్కెట్ ఊరికే రాలేదని ఆయన గుర్తు చేశారు. బీసీ సామాజిక వర్గం నుంచి తాను టిక్కెట్ ఆశిస్తున్నానని అంజన్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. తమ ఇంట్లో తండ్రి కొడుకులిద్దరం పార్టీ కోసం పనిచేస్తున్నప్పటికీ, వేతనం మాత్రం ఒక్కరికే వస్తోందని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పీసీసీ అధ్యక్ష పదవి చర్చల సమయంలో తనకు అన్యాయం జరగదని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

## హెచ్‌సీఏలో అక్రమాలు.. కేటీఆర్, కవితలపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సంచలన ఆరోపణలు

* హెచ్‌సీఏలో అక్రమాల వెనుక బీఆర్ఎస్ నేతలు ఉన్నారన్న టీసీఏ
* ఈ మేరకు సీఐడీ డీజీ చారుసిన్హాకు ఫిర్యాదు
* హెచ్‌సీఏ అక్రమాల్లో మరికొందరి పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్న టీసీఏ

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) సంచలన ఆరోపణలు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమాల


THE TELANGANA CRICKET ASSOCIATION

Plot # 1267/A, Road # 63A, Jubilee Hills, Hyderabad -500033, Telangana.
Phone: +91 90100 45896, Email: info@tCricket.in, www.tCricket.in Regd. No. 967 of 2015

Date: 17-Jul-2025
Hyderabad

To,
1. Ms. Charu Sinha – IPS garu
Addl. Director General of Police, CID
CID Head Quarters, 3rd Floor
Lakdikapul, Hyderabad – 500004

2. Shri Rohit Anand – IRS garu
Joint Director, ED
3rd Floor, Shakar Bhawan
Hyderabad- 500004

Dear Sir/ Madame

వెనుక వీరి హస్తముందని ఆరోపించింది. ఈ మేరకు సీఐడీ డీజీ చారుసిన్హాకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏ అక్రమాల్లో మరికొందరి పాత్ర ఉందని వారు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి జాన్ మనోజ్, విజయానంద్, పురుషోత్తం అగర్వాల్, సురేందర్ అగర్వాల్, వంకా ప్రతాప్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో పెద్దల అండదండలతో జగన్‌మోహన్ రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రికెట్‌కు సంబంధం లేని రాజకీయ నేతల ప్రమేయంపై విచారణ చేయాలని సీఐడీని టీసీఏ అధికారులు కోరారు. హెచ్‌సీఏ అక్రమాల వ్యవహారంపై సీఐడీతో పాటు ఈడీకి కూడా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. మనీలాండరింగ్ కోణం ఉందని విచారణ జరపాలని టీసీఏ ఫిర్యాదులో తెలిపింది. ఇప్పటికే హెచ్‌సీఏ అక్రమాలపై పూర్తి వివరాలు అందజేయాలని సీఐడీ ఈడీ కోరింది.

## బీటెక్, ఫార్మా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో బీఈ, బీటెక్, ఫార్మా కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 19న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి తెలిపింది. ఆగస్ట్ 10 వరకు మేనేజ్‌మెంట్ కోటా సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. బీఈ, బీటెక్, ఫార్మా కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటాలో 30 శాతం సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది.




## హరీశ్ ఆరడుగులు పెరిగాడే కానీ... మెదడు అర అంగుళం కూడా పెంచుకోలేదు

* గోదావరిలో 3 వేల టీఎంసీల వరదను ఏపీ వినియోగించుకోవచ్చని కేసీఆర్ చెప్పారన్న మహేశ్ కుమార్
* రాయలసీమను రతనాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారని వ్యాఖ్య
* కేసీఆర్ వల్లే వాళ్లు బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల కడుతున్నారన్న మహేశ్
* హరీశ్ రావు పిచ్చి వాగుడు వాగుతున్నాడని మండిపాటు
* ముఖ్యమంత్రుల సమావేశంలో ఏం మాట్లాడారో సీఆర్ పాటిల్ స్వయంగా చెప్పారన్న మహేశ్

రాయలసీమను రతనాలసీమ చేస్తాను... బేసిన్లు లేవు, సరిహద్దులు లేవు అని ఆనాడు కేసీఆర్ అనడం వల్లే... ఇవాళ వాళ్లు (ఏపీ) బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు కడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రతి ఏటా గోదావరిలో 3 వేల టీఎంసీల వరద ఉంటుందని... ఈ నీటి ఏపీ వాడుకోవచ్చని గతంలో కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరు అడుగులు పెరిగాడే కానీ.... అర అంగుళం మెదడు కూడా పెంచుకోలేదని ఎద్దేవా చేశారు. అర్థపర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏదో ఒకటి మాట్లాడి ఉనికిని చాటుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. నీటి పారుదల అంశాలపై నిన్న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు సమావేశమయ్యారని... ఏ అంశాలపై చర్చ జరిగిందో స్వయంగా సీఆర్ పాటిల్ చెప్పినప్పటికీ హరీశ్ రావు పిచ్చి వాగుడు వాగుతున్నారని మహేశ్ కుమార్ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కూడా ప్రెస్ మీట్ పెట్టి ఏయే అంశాలపై




మాట్లాడారో వివరంగా చెప్పారని... ఇవేవీ హరీశ్ రావు మెదడుకు ఎక్కినట్టు లేవని అన్నారు. తెలంగాణకు అడ్డగోలుగా ద్రోహం చేసిన మీరే ఇప్పుడు సిగ్గు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మీద, సీఎం రేవంత్ మీద, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మీకు దమ్ముంటే అసెంబ్లీలో పెట్టే చర్చలకు రావాలని సవాల్ విసిరారు. నువ్వు, మీ మామ కేసీఆర్ వచ్చి మీ వాదనలు వినిపించాలని అన్నారు. ప్రెస్ మీట్లు పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకుదామని చూస్తే ప్రజలు నమ్మరని చెప్పారు.




## బెట్టింగ్‌కు బానిసై సోదరుడి ఇంట్లో చోరీ.. నిందితురాలి అరెస్టు

హైదరాబాద్: బెట్టింగ్ మహమ్మారి బంధుత్వాల మధ్య చిచ్చు రేపుతోంది. బెట్టింగ్‌కు బానిసై ఓ సోదరి తన సోదరుడి ఇంట్లోనే చోరీ చేసింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని గాజుల రామారం పరిధి షిర్డీహిల్స్‌లో చోటుచేసుకుంది. ఈ నెల 5న చోరీ జరగ్గా.. తాజాగా నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తులో కీలక వివరాలు రాబట్టారు. బెట్టింగ్‌కు బానిసైన సోదరే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఆమె.. దాదాపు రూ.5లక్షలు అప్పు చేసింది. ఆ మొత్తాన్ని తీర్చేందుకు.. తన స్నేహితులు కార్తిక్, అఖిల్‌తో కలిసి చోరీకి పథకం వేసింది. కారుకు పూజ చేసేందుకు సోదరుడు కర్మాన్‌ఘాట్ వెళ్లిన సమయంలో తన పథకాన్ని అమలు చేసి.. 12 తులాల బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసింది. అనంతరం వాటిని తనఖా పెట్టి డబ్బులు తీసుకుంది. నిందితులు ముగ్గుర్నీ అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఓఎంసీ కేసు.. శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేయాలన్న సీబీఐ

హైదరాబాద్: ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు. ఓఎంసీకి అక్రమంగా మైనింగ్ లీజు అప్పగించారని అన్నారు. ఓఎంసీకి లీజు కేటాయించేలా శ్రీలక్ష్మి



చొరవతీసుకున్నారని కోర్టుకు వివరించారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి లీజు వచ్చేలా చూశారని తెలిపారు. ఆమె అక్రమాలకు పాల్పడ్డారనడానికి ఆధారాలు ఉన్నాయని, సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాతే సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. సబిత, కృపానందం కేసును తనకు అన్వయించుకోవడం సరికాదని.. శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## 5 వేల మందిని తొలగిస్తున్నాం..

### లేఆఫ్స్ ప్రకటించిన ఇంటెల్




**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా చిప్ తయారీ సంస్థ ఇంటెల్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ వారంలో 5 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.

కాగా, ఇంటెల్ 4 వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించనున్నట్లు ఇటీవలే అంచనాలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే, 4 వేల మంది కాదని, 5 వేల మందిని తొలగిస్తున్నట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ వారంలోనే అమెరికా వ్యాప్తంగా తొలగింపులు ఉంటాయని స్పష్టం చేసింది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా లే ఆఫ్‌లు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒరెగాన్, కాలిఫోర్నియాలో ఎక్కువగా తొలగింపులు ఉంటాయని పేర్కొంది.

ఇందులో కాలిఫోర్నియా ఆఫీస్ నుంచి 1,935 మంది, ఒరెగాన్ యూనిట్ నుంచి 2,392 మంది తమ ఉద్యోగాలను కోల్పోనున్నట్లు తెలిసింది. అరిజోనా కార్యాలయం నుంచి 696 మందిపై వేటు పడనున్నట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్న ఇంటెల్, తన ఉద్యోగుల్లో 20 శాతానికి పైగా తొలగించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే లేఆఫ్స్‌ను ప్రకటించింది.

## నాటో చీఫ్ వార్నింగ్‌పై భారత్ స్పందన

### రష్యాతో వాణిజ్యం కొనసాగించే దేశాలకు నాటో చీఫ్ హెచ్చరిక

### 100 శాతం సెకండరీ ఆంక్షలు విధిస్తామని స్పష్టీకరణ

### నాటో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందన్న భారత విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ:** రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తే తీవ్ర ఆంక్షలు విధించే అవకాశం ఉందని నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ హెచ్చరించిన నేపథ్యంలో, భారత్ గట్టి స్పందనను వ్యక్తం చేసింది. ఈ విషయంపై ద్వంద్వ ప్రమాణాలను అనుసరించవద్దని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. భారత్‌కు ఇంధన భద్రత అత్యంత ప్రాధాన్యత అని, ఈ విషయంలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలు మరియు ప్రపంచ పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని ఉద్ఘాటించారు.

మార్క్ రూట్, అమెరికా సెనేటర్లతో కలిసి వాషింగ్టన్‌లో జరిగిన ఒక సమావేశంలో, భారత్, చైనా, బ్రెజిల్‌లు రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగిస్తే 100 శాతం సెకండరీ ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోకపోతే ఈ ఆంక్షలు విధిస్తామని ఆయన తెలిపారు. ఈ హెచ్చరికలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రష్యాతో వాణిజ్యం కొనసాగించే దేశాలపై కఠిన సుంకాలు విధిస్తామని చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉన్నాయి.

భారత్, రష్యా నుంచి డిస్కౌంట్ ధరలకు చమురు కొనుగోలు చేస్తూ, దేశీయ ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడంతో పాటు, ఆర్థిక వృద్ధిని నిలకడగా కొనసాగిస్తోంది. భారత్ 80 శాతం చమురు మరియు 50 శాతం సహజవాయువు దిగుమతులపై ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో, భారత్‌కు ఇంధన భద్రత కీలకం. అయితే, నాటో సభ్య దేశాలైన టర్కీ, హంగరీ, స్లోవాకియా వంటి దేశాలు కూడా రష్యా నుంచి ఇంధన దిగుమతులు చేస్తున్నాయని, వీటిపై నాటో మౌనంగా ఉంటోందని భారత్ గుర్తు చేసింది. ఈ ద్వంద్వ ప్రమాణాలపై జైస్వాల్ ప్రత్యేకంగా హెచ్చరించారు.

కేంద్ర ఇంధన మంత్రి హర్దీప్ సింగ్ పురీ గతంలో, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ చమురు ధరలు స్థిరంగా ఉన్నాయని, లేకపోతే బ్యారెల్‌కు 120-130 డాలర్లకు చేరేవని వెల్లడించారు. ఈ సందర్భంగా, భారత్ తన ఇంధన వనరుల విషయంలో జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేసింది.

## పేపర్, నెట్‌వర్కింగ్ రంగాల్లో ఐపీవోల సందడి..

### రూ. 300 కోట్ల టార్గెట్‌తో దిగిన కంపెనీలివే..




**న్యూఢిల్లీ:** పర్యావరణహిత పేపర్ల తయారీలో ప్రసిద్ధి చెందిన సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నెట్‌వర్కింగ్ కేబుల్స్, పరికరాల తయారీదారు ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) లిమిటెడ్ , తమ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) కోసం మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీకి ముసాయిదా డీఆర్‌హెచ్‌పీలను సమర్పించాయి. సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ రూ. 300 కోట్ల ఐపీవోను లక్ష్యంగా చేసుకోగా, ఓరియంట్ కేబుల్స్ రూ. 700 కోట్ల సమీకరణకు ప్రణాళికలు రచిస్తోంది.

**సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ ఐపీవో వివరాలు:**

సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తమ ఐపీవో ద్వారా రూ. 300 కోట్ల విలువైన షేర్లను తాజాగా జారీ చేయనుంది. అలాగే, ప్రస్తుత షేర్‌హోల్డర్లు 3,22,00,000 షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించనున్నారు. ఒక్కో షేరు ముఖ విలువ రూ. 5 గా నిర్ణయించారు. ఈ ఐపీవో ద్వారా సమకూరిన నిధులను కంపెనీ వ్యర్థాల నుంచి 14 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పవర్ ప్లాంట్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 177.507 కోట్లు ఉపయోగించనుంది. అదనంగా, రూ. 34.639 కోట్లను ప్రస్తుత తయారీ ప్లాంట్‌లో రీవైండర్, షీటర్ సామర్థ్యాల మెరుగుదల, ఇన్-హౌస్ వేర్‌హౌస్‌ల నిర్మాణానికి కేటాయించనున్నారు. సుమారు రూ. 72 కోట్లను నిర్దిష్ట రుణాల చెల్లింపునకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నారు. సిల్వర్‌టన్ ఇండస్ట్రీస్.. రైటింగ్, ప్రింటింగ్ పేపర్, క్రాఫ్ట్ పేపర్, కప్‌స్టాక్ పేపర్ వంటి పర్యావరణహిత స్పెషాలిటీ పేపర్ ఉత్పత్తులను రిటైల్, కార్పొరేట్, విద్య, ప్రభుత్వ రంగ సంస్థలకు అందిస్తోంది.

**ఓరియంట్ కేబుల్స్ లిమిటెడ్ ఐపీవో వివరాలు:**

ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) లిమిటెడ్ ఐపీవో కింద షేర్ల విక్రయం ద్వారా రూ.700 కోట్ల వరకు నిధులు సమీకరించాలని చూస్తోంది. ఇందులో రూ. 320 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, సెల్లింగ్ షేర్‌హోల్డర్లు రూ. 380 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఒక్కో షేరు ముఖ విలువ రూ. 1 గా ఉంటుంది. ఇష్యూ ద్వారా సమకూరిన నిధుల్లో సుమారు రూ. 91.50 కోట్లను తయారీ ప్లాంట్‌లో యంత్ర పరికరాల కొనుగోలు, సివిల్ పనుల కోసం కేటాయించనున్నారు. సుమారు రూ. 155.50 కోట్లను రుణాల చెల్లింపునకు ఉపయోగించనుండగా, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకుంటారు.

# 'థ్యాంక్యూ ఫుట్‌బాల్'

## తొలి మహిళా గోల్‌కీపర్ భావోద్వేగ పోస్ట్..!




**న్యూఢిల్లీ:** భారత ఫుట్‌బాల్‌లో ఒక అధ్యాయానికి తెరపడింది. తొలి మహిళా గోల్ కీపర్‌గా చరిత్ర సృష్టించిన అదితీ చౌహన్ తనకెంటో ఇష్టమైన ఆటకు వీడ్కోలు పలికింది. పదేళ్లుగా గోల్ కీపర్‌గా జట్టుకు అమూల్యమైన సేవలందించిన అదితి గురువారం తన కెరీర్‌ను ముగించింది. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఒడిదొడుకులు.. ఎన్నో చిరస్మరణీయ విజయాలను చవిచూసిన ఆమె సగర్వంగా ఫుట్‌బాల్‌కు అల్విదా చెప్పేసింది. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా పోస్ట్ ద్వారా అభిమానులతో పంచుకుంది.

థ్యాంక్యూ ఫుట్‌బాల్. నన్ను ఈ స్థాయికి చేర్చినందుకు.. నాకు ఎన్నో పరీక్షలు పెట్టినందుకు, నాకంటూ ఒక గుర్తింపు ఇచ్చినందుకు. మరుపంటూ రాని 17 ఏళ్ల ప్రయాణాన్ని ముగిస్తున్నాను అని మాజీ గోల్ కీపర్ ఎక్స్‌లో భావోద్వేగంతో పోస్ట్ పెట్టింది. ఫుట్‌బాల్ నాకు కెరీర్ మాత్రమే కాదు ఇంకా చాలా ఇచ్చింది. నాకు తొలి మహిళా గోల్ కీపర్ అనే గుర్తింపును తెచ్చింది. ఢిల్లీ నుంచి నా కలల్ని సాకారం చేసుకుంటూ.. లండన్ వరకూ వెళ్లాను. అక్కడే నేను స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశాను. అదే సమయంలో వెస్ట్ హమ్ యునైటె డ్ జట్టు తరఫున ఆడాను.

చదువు, ఫుట్‌బాల్.. రెండిటిలో ఏది ముఖ్యమో తేల్చుకోవాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే.. నా దృష్టిలో రెండూ ముఖ్యమే. అందుకే.. రెండిటినీ బ్యాలెన్స్ చేసేందుకు ఎంతో కష్టపడ్డాను. రెండు పర్యాయాలు మోకాలి లిగమెంట్స్ గాయంతో బాధపడ్డాను. అయినా ఆటపై ఉన్న ఇష్టంతో త్వరగా కోలుకున్నాక మైదానంలో అడుగుపెట్టాను. ఇతరులకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతోనే గుండె నిబ్బరంతో గాయాల్ని అధిగమిస్తూ గోల్ కీపింగ్ చేశాను. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో కుటుంబం, కోచ్, సహచరులు అందించిన సహకారం మరువలేనిది అని అదితి వెల్లడించింది.

**తమిళనాడు నుంచి ఢిల్లీకి..**

అదితి స్వరాష్ట్రం తమిళనాడు. కానీ, కొన్నాళ్లకు వాళ్ల కుటుంబం ఢిల్లీకి మకాం మార్చింది. చిన్నప్పటి నుంచే ఫుట్‌బాల్ మీద ఇష్టం పెంచుకున్న ఆమె.. పెద్దయ్యాక గోల్ కీపర్ అయింది. భారత తొలి మహిళా గోల్ కీపర్‌గా రికార్డు నెలకొల్పిన అదితి.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది అదితి. 2012, 2016, 2019లో సీనియర్ టీమ్ ఎస్ఏఎఫ్ఎఫ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందడంలో ఆమె కృషి ఎనలేనిది. గోకులం కేరళ ఎఫ్‌సీ తరఫున ఇండియన్ ఉమెన్స్ లీగ్ టైటిల్ సాధించింది అదితి.

## సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్..

### రెండో రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి

**జపాన్:** జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తొలి రౌండ్‌లోనే



నిష్క్రమించగా.. లక్ష్య సేన్, సాత్విక్-చిరాగ్ ఆమెను అనుసరిస్తూ ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ సేన్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19-21, 11-21తో అనూహ్యంగా కంగుతిన్నాడు.

డబుల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి ద్వయం తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. యితే.. రెండో రౌండ్‌లో మాత్రం ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది భారత జోడీ. గురువారం హోరాహోరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్ వాంగ్ చాంగ్ (చైనా) జంటకు బదులివ్వలేకపోయింది చిరాగ్ ద్వయం.

తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా..22-24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14-21తో దారుణ ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7-2కు పెంచుకున్నారు.

## దూసుకొస్తున్నాడు మన బోల్ట్

### అథ్లెటిక్స్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తాడా..!

**న్యూఢిల్లీ:** క్రికెట్.. హాకీ.. బ్యాడ్మింటన్.. నీరజ్ చోప్రా రాకతో ఈమధ్య కాలంలో జావెలిన్ త్రోలో భారతదేశం పేరు విశ్వవేదికపై మార్మోగిపోతోంది. కానీ, అథ్లెటిక్స్‌లో మాత్రం ఆసియా క్రీడల వరకే మనోళ్ల విజయాలు పరిమితం అయ్యాయి. కరణం మల్లీశ్వరీ, పీటి ఉష.. అంజూ బీజార్జ్.. కుంజరాణి వంటి వారు దేశ ప్రతిష్టను పెంచినా.. ఆ తర్వాతి తరం వీళ్ల వారసత్వాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అవినాష్ సబ్లే, పరుల్ చౌదరీ, జ్యోతి ఎర్రాజీలు ఫర్వాలేదనిపిస్తున్నా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీద చిరుతాల పరుగెత్తి పతకాలు కొల్లగొట్టే అథ్లెట్లు కరువయ్యారు. అయితే.. అనిమేశ్ కుజుర్ రూపంలో భారత్‌కు 'ఉసేన్ బోల్ట్' లాంటి పరుగుల వీరుడు దొరికాడు.

బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న ఈ యువకెరటం.. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టాడు. ఈ పోటీలకు అర్హత సాధించాడంటే అనిమేశ్ చరిత్ర సృష్టించడం ఖాయం. ట్రాక్ మీద రాకెట్ వేగంతో దూసుకెళ్లే అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20




సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి ది 'ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్.

22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ్ లీగ్‌లో పోటీపడ్డాడు. అండర్ -23 విభాగంలో 200 మీటర్ల పరుగులో ఆస్ట్రేలియా స్టార్ గౌట్ గౌట్‌తో 'నువ్వానేనా' అన్నట్టు పరుగు తీసి ఔరా అనిపించాడు అనిమేశ్. అయితే.. సెకన్లో పదో వంతుతో పోడియం మీద నిల్చొనే అవకాశం కోల్పోయాడు. అయినా సరే.. అతడేమీ నిరాశకు లోనవ్వడం లేదు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో అంతర్జాతీయ వేదికలపై భారతీయ జెండాను రెపరెపలాడించేందుకు మరింత గట్టిగా ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్నాడీ యంగ్ అథ్లెట్.

ప్రస్తుతానికి సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ టోర్నీని లక్ష్యంగా పెట్టుకున్నాడు అనిమేశ్. తన వేగంతో నేను కచ్చితంగా క్వాలిఫై అవుతాను కోచ్. మీరు ఏమీ కంగారు పడకండి అని అనిమేశ్ ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు.

# క్వార్టర్స్‌లో తెలంగాణ కెరటం

### వరల్డ్ నంబర్ 1 ఆట కట్టించిన ప్రజ్ఞానంద..!

**న్యూఢిల్లీ:** భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద విశ్వ వేదికపై మరోసారి సంచలన ఆటతో అదరగొట్టాడు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ కు ముచ్చెమటలు పట్టించాడు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో మాగ్నస్‌ను సులువగా మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. తెలంగాణ కుర్రాడు అర్జున్ ఎరిగేసి కూడా అద్భుత విజయంతో క్వార్టర్స్ చేరుకున్నాడు.

ఈమధ్యే భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో కార్ల్‌సన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ షాక్ నుంచి తేరుకొనేలోపే ఈసారి ప్రజ్ఞానంద అతడిని చావుదెబ్బ కొట్టాడు. తెల్ల పావులతో ఆడిన ఈ కేరళ కుర్రాడు ఆది నుంచి వ్యూహాత్మక దాడితో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఒకదశలో నార్వ దిగ్గజానికి పట్టు సాధించే అవకాశం వచ్చింది. కానీ, ప్రజ్ఞానంద అతడికి ఏమాత్రం పుంజుకునే అవకాశం ఇవ్వకుండా చెక్ పెట్టాడు. ఇదివరకే వెస్లే సో చేతిలో కంగుతిన్న కార్ల్‌సన్ మూడో స్థానం కోసం పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో వివిధ దేశాలకు చెందిన 16 మంది గ్రాండ్‌మాస్టర్లు పోటీ పడుతున్నారు. వీళ్లను రెండు గ్రూపులుగా విభజించి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో .. రెండు గ్రూప్‌ల నుంచి టాప్-4లో నిలిచిని వాళ్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. విజేతగా నిలిచిన వాళ్లకు 750,000 యూఎస్ డాలర్ల (భారతీయ కరెన్సీలో రూ.6.45 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కనుంది.



# ఆస్కార్ లెవెల్లో మహేశ్ మూవీకి ప్లాన్

**టాకీస్:** దర్శకధీరుడు రాజమౌళి ఏం చేసినా భారీ ప్లాన్ తోనే చేస్తాడు. ఇప్పుడు మహేశ్ బాబుతో తీస్తున్న ఎస్ ఎస్ ఎంబీ29 సినిమా కోసం భారీ ప్లాన్ చేస్తున్నాడంట. ఆస్కార్ అవార్డు కోసం రాజమౌళి బిగ్ స్కెచ్ వేస్తున్నట్టు- తెలుస్తోంది. ఆల్రెడీ త్రిబుల్ ఆర్ మూవీతో ఒకటి తీసుకొచ్చాడు. ఇప్పుడు ఇంకోదానిపై కన్నేసినట్టు తెలుస్తోంది. అయితే నిర్మాణ సంస్థగా చూపించేందుకు రాజమౌళి ప్రయత్నిస్తున్నారంట. అందుకోసం హాలీవుడ్ కు చెందిన నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు- తెలుస్తోంది. హాలీవుడ్ నిర్మాణ సంస్థను మొదటి ప్రొడ్యూసర్ గా చూపించి కేఎల్ నారాయణను రెండో సంస్థగా చూపించవచ్చు. అలా చేస్తే మూవీ హాలీవుడ్ కోటాలో నేరుగా ఆస్కార్ అవార్డుకు



తెలుగు నిర్మాణ సంస్థలతో మూవీ చేస్తే ప్రతిసారి ఫారిన్ కేటగిరీలో నామినేషన్స్ వేయాల్సి వస్తోంది. అప్పుడు ఆస్కార్ అవార్డుల అవకాశాలు బాగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మహేశ్ తో చేస్తున్న మూవీని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ మీద డాక్టర్ కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. తెలుగు బ్యానర్ మీద కాకుండా హాలీవుడ్ బ్యానర్ ను మెయిన్ నామినేట్ చేయొచ్చు. అప్పుడు ఎక్కువ విభాగాల్లో ఆస్కార్ కు నామినేషన్స్ వేయొచ్చు. కాకపోతే మూవీ షూట్ ను డైరెక్ట్ గా ఇంగ్లిష్ లో చేయాలి. అదేమంత పెద్ద కష్టం కాకపోయినా.. కొంత బడ్జెట్ పెరుగుతుంది. ఆ లెక్కలు అన్నీ కార్తికేయ చూసుకుంటున్నట్టు తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే దీనిపై అనౌన్స్ మెంట్ వస్తుంది.

# సోషియో డ్రామాగా వస్తున్న పరదా మూవీ

టాకీస్: అనుపమ పరమేశ్వరన్ కీలక పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించిన చిత్రం 'పరదా'. భిన్నమైన సోషియో డ్రామా కథాంశంతో రూపొందింది. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ సినిమా నుంచి థీమ్ ఆఫ్ పరదా 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన ఈవెంట్‌కు నిర్మాత సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒక మంచి విడుదల తేదీ దొరకడానికి ఆరు నెలలు పట్టింది. అన్ని ఏర్పాట్లు- చేసుకున్న తర్వాత అదేరోజు పెద్ద సినిమా రిలీజ్ అయ్యేది. థియేటర్లు దొరకలేదు. అందుకే ఇంత సమయం పట్టింది. నిజం చెప్పాలంటే.. ఒక అమ్మాయి ప్రధాన పాత్రలో నటించిన సినిమా వస్తుందంటే.. ఎవరూ ముందుకురారు. నిర్మాతలు, ఓటీటీ- సంస్థలు, ఒక్కోసారి ఆడియన్స్ కూడా ప్రోత్సహించడానికి ముందుకురారు. అది ఎంత మంచి సినిమా అయినా అంతే. దాన్ని తప్పు అని నేను అనడం లేదు. అది వాస్తవం. 'పరదా' కారణంగానే ఈ వాస్తవాన్ని తెలుసుకున్నాను. మా సినిమా సంవత్సరం క్రితమే రెడీ అయింది. ఏడాదిగా మా టీమ్ పడిన కష్టం దగ్గర నుంచి చూశాను. ఇది చిన్న సినిమా అని అందరూ చెబుతున్నారు. కానీ ఇది చాలా మంచి సినిమా. ఎన్నో కమర్షియల్ మూమెంట్స్ ఉంటాయి. 'పరదా'ను థియేటర్‌లలో చూడాలని కోరుకుంటున్నాను. ఇప్పటివరకూ మీ సపోర్ట్‌కు ధన్యవాదాలు. ఇకపై కూడా ఇలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అనుపమ అన్నారు. చిరంజీవి పుట్టినరోజుకు మించి ఈ సినిమాను విడుదల చేయడానికి మంచి తేదీ ఉండదు. అందుకే ఆగస్టు 22న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించాం. నా మొదటి చిత్రం 'సినిమా బండి'కి ఇఫీలో అవార్డు వచ్చినప్పుడు నేను చిరంజీవి దగ్గర నుంచి దీవెనలు తీసుకున్నాను. 10 ఏళ్ల క్రితం రామానాయుడు స్టూడియోలో సురేశ్ బాబును కలిశాను. అప్పుడే నన్ను ప్రోత్సహించారు. 'పరదా' కథ విన్న తర్వాత సురేశ్‌బాబు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇది నాకెంతో ప్రత్యేకం. సినిమా అంతా పరదాలోనే ఉండాలంటే ఏ నటీ అంగీకరించదు. ఇలాంటి ఛాలెంజింగ్ రోల్‌కు అనుపమ ఓకే చెప్పారు. మా టీమ్ అందరికీ ఇది బాహుబలి లాంటి సినిమా అని దర్శకుడు చెప్పారు. దీని ట్రైలర్ చూసి నిజంగా షాక్ అయ్యాను. చిత్రబృందమంతా ఎంతో ఆసక్తిగా పనిచేసింది. ధైర్యంగా దీన్ని తీశారు. సినిమా పరిశ్రమ ముందుకుసాగాలి అంటే ఇలాంటి చిత్రాలు రావాలి.





# మోనికా పాట కోసం బాగా కష్టపడ్డా: పూజాహెగ్డే

టాకీస్: రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం వర్క్ చేశారు నటి పూజా హెగ్డే. మోనికా బెల్లూచి అంటూ సాగే ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. పూజాహెగ్డే, సౌబిన్ షాహిర్ డ్యాన్స్‌కు సినీప్రియులు ఫిదా అయ్యారు. ఈ పాటకు వస్తోన్న ఆదరణను ఉద్దేశించి తాజాగా పూజాహెగ్డే ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీనిని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు. కాలు బెణికినప్పటికీ పాట కోసం వర్క్ చేసినట్లు- ఆమె చెప్పారు. మోనికాపై మీరు చూపిస్తోన్న ప్రేమాభిమానానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ఎంతగానో శ్రమించిన పాట ఇది. విపరీతమైన వేడి, ఎండ, దుమ్ము. కాలు బెణికిన తర్వాత నేను చేసిన తొలి సాంగ్ అయినప్పటికీ ఇవేమీ స్క్రీన్‌పై కనిపించకుండా కేవలం గ్లామరస్‌గా ప్రేక్షకులను అలరించేందుకు శ్రమించా. మోనికా కోసం నా బెస్ట్ ఇచ్చా. థియేటర్లలో చూసినప్పుడు ఇది తప్పకుండా అద్భుతంగా ఉంటుంది. నేను మీకు మాటిస్తున్నా. మీరంతా డ్యాన్స్ చేస్తారు. ఈ టాస్క్‌లో నాకు సపోర్ట్‌గా నిలిచిన డ్యాన్సర్లకు థాంక్యూ అని ఆమె చెప్పుకొచ్చారు. అంతేకాకుండా మహాశివరాత్రి నాడు ఈ పాట షూట్ చేసినట్లు ఆమె చెప్పారు. ఆరోజు తాను ఉపవాసం ఉన్నట్లు తెలిపారు. యాక్షన్ థ్రిల్లర్ మూవీగా 'కూలీ' సిద్ధమవుతోంది. హార్బర్ ఇతివృత్తంగా సాగే కథ ఇది. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల 'మోనికా' పాటను టీమ్ విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఈ పాట తెలుగు, తమిళం, హిందీలో 21 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. సౌబిన్ షాహిర్ డ్యాన్స్‌ను అందరూ మెచ్చుకుంటున్నారు.

# ఆసక్తికరంగా 'మై బేబీ' ట్రైలర్

టాకీస్: ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. నెల్సన్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిమిషా సజయన్, అథర్వ మురళి కీలక పాత్రల్లో నటించారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి విజయవంతమైన అనువాద చిత్రాలను అందించిన సురేష్ కొండేటి, 'మై బేబి'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సినిమా విడుదలకు ఒక్కరోజే ఉండడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

ఈ ట్రైలర్ చూస్తుంటే.. హాస్పిటల్ మాఫియా ఆధారంగా తెరకెక్కినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం ఆనంద్ (అథర్వ), దివ్య (నిమిషా సజయన్) అనే జంట చుట్టూ తిరుగుతుంది. ఆనంద్ తన లవ్ ఫెయిల్ అవ్వడం వలన మందుకి బానిసగా మారతాడు. దివ్య బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్ అనే



మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటుంది. వీరిద్దరికి అనుకోకుండా పెళ్లి జరుగుతుంది. అయితే ఆనంద్ దివ్య మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెను ప్రేమిస్తాడు. వారిద్దరూ సంతోషంగా జీవిస్తారు.

ఈ క్రమంలోనే దివ్య గర్భవతి అవుతుంది, వారికి ఒక బాబు పుడతాడు. అయితే, బిడ్డ పుట్టిన కొన్ని నిమిషాలకే, ఆ బిడ్డ తమది కాదని, ఎవరో ఆసుపత్రిలో మార్చేశారని దివ్య పదేపదే చెబుతుంది. ఆమె మానసిక స్థితి కారణంగా మొదట ఎవరూ ఆమె మాటలు నమ్మరు. కానీ ఆనంద్ తన భార్య మాటలను నమ్మి, నిజం తెలుసుకోవడానికి బయలుదేరతాడు. ఆనంద్ తన బిడ్డను కనుగొనడానికి వెళ్లిన క్రమంలో పిల్లలను కిడ్నాప్ చేసి అమ్ముకునే ఒక పెద్ద నెట్‌వర్క్‌ను కనుగొంటాడు. అయితే ఈ నెట్‌వర్క్‌ని నడిపిస్తుంది ఎవరు. ఆనంద్ ఈ నెట్‌వర్క్‌ని ఎలా కనిపెట్టాడు. దివ్య తనకి పుట్టిన బిడ్డని మార్చేశారు అని ఎలా తెలుసుకుంటుంది అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

# హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముహూర్తం ఖరారు..

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ప్రతిష్టాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' వచ్చే వారం (జూలై 24) గ్రాండ్‌గా రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఫ్యాన్స్ మాత్రమే కాదు.. సినిమా ప్రేమికులంతా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలి విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. పవన్ కళ్యాణ్ గెటప్, భారీ యాక్షన్ సీక్వెన్సెస్, విజువల్స్ అన్ని నెక్స్ట్ లెవల్ అని అభిమానులు అంటున్నారు. ట్రైలర్ విడుదల తర్వాతే అసలు మ్యాజిక్ మొదలైందన్నది ట్రేడ్ వర్గాల అభిప్రాయం.





అయితే ప్రమోషన్‌లో భాగంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ముందుగా తిరుపతిలో నిర్వహించాలనుకుంది చిత్ర బృందం. ఆ తర్వాత విజయవాడ అన్నారు. అనంతరం వైజాగ్ అంటూ ప్రచారం జరిగింది. కాని చివరకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనున్నట్టు అఫీషియల్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఈవెంట్‌కి గెస్ట్‌గా పలువురు రాజకీయ నాయకులు, రాజమౌళి, త్రివిక్రమ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్టు తెలుస్తుంది. ట్రైలర్ విడుదల అనంతరం సినిమా బిజినెస్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం ఫ్యాన్సీ ఆఫర్లు వస్తున్నట్లు టాక్. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లోనూ ఈ సినిమా విడుదలకానుంది. పవన్‌కు పాన్-ఇండియా స్థాయిలో ఉన్న క్రేజ్ సినిమాకు హైప్‌ను మరింత పెంచుతోంది.

పవన్ కళ్యాణ్ రాజకీయంగా బిజీగా ఉండడం, కోవిడ్-19 లాక్‌డౌన్లు తదితర కారణాల వల్ల మూవీ విడుదల ఆలస్యం అయ్యింది. అయినా అంచనాలు మాత్రం పీక్స్‌లోనే ఉన్నాయి. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం నిర్మిస్తున్నారు. గతంలో పవన్‌తో కలిసి 'ఖుషి' లాంటి బ్లాక్‌బస్టర్‌ని ఇచ్చిన ఆయన, మళ్లీ పవన్‌తో కలిసి పనిచేస్తుండటంతో ఫ్యాన్స్‌లో మంచి బజ్ నెలకొంది. ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఎం.ఎం. కీరవాణి అందించిన మ్యూజిక్ సినిమాకి ప్రధాన బలం కానుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. నిధి అగర్వాల్, అలాగే నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.